# ఈరోజు

## మహిళ కల సాకారం కాబోతోంది: ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్:** అధికారంలో సగం కావాలన్న మహిళల కల సాకారం కాబోతున్నదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక బీఆర్ఎస్ కృషి ఉందన్నారు. మహిళా బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్ర కేబినెట్ ఒక మంచి నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని సాగతిస్తున్నామని చెప్పారు. అధికారంలో సగం కావాలన్న మహిళ కల సాకారం కాబోతున్నదని, ఇది దేశంలోని ప్రతిఒక్క మహిళ విజయమన్నారు.

సంపుటి 3 సంచిక 222 | హైదరాబాద్, సెప్టెంబరు 20 బుధవారం 2023 | 4 పేజీలు | వెల : 2.00

# మహిళకు వందనం!





**పార్లమెంటుకు మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు**
**లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 33 శాతం కోటా**
**'నారీ శక్తి వందన్ అధినియమ్' పేరిట బిల్లును**
**ప్రవేశపెట్టిన కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్**
**పార్లమెంటు కొత్త భవనంలో తొలిరోజునే చరిత్రాత్మక అడుగు**
**15 ఏళ్లపాటు రిజర్వేషన్.. ఆ తర్వాత పెంచుకునే చాన్స్**
**ఎస్సీ, ఎస్టీ మహిళా కోటా సీట్లూ మూడో వంతులోనే**
**పునర్విభజన లెక్కలను బట్టి రొటేషన్ పద్ధతిలో అమలు**
**బిల్లు ఆమోదం పొందినా అమలయ్యేది 2027 తర్వాతే**
**జన గణనకు, నియోజకవర్గాల పునర్విభజనకు లింకే కారణం**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 19 : మహిళలకు మరిన్ని పదవులు రానున్నాయి! చట్టసభల్లో మహారాణులుగా వెలిగే అవకాశం! దాదాపు మూడు దశాబ్దాల కల సాకారం కానున్న సందర్భం! పార్లమెంటు కొత్త భవనం ప్రారంభించిన రోజునే.. చరిత్రాత్మక బిల్లు పట్టాలకెక్కింది! లోక్‌సభలోనూ, రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 128వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రత్యేక సమావేశాల్లో పార్లమెంటు ముందుకు వచ్చింది! 'నారీ శక్తి వందన్ అధినియమ్' పేరిట రూపొందించిన ఈ బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంటు కొత్త భవనంలో ప్రవేశపెట్టిన తొలి బిల్లు ఇదే కావడం విశేషం. బిల్లులోని 330ఏ క్లాజ్ ప్రకారం లోక్‌సభలోనూ, 332 క్లాజ్ ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన సీట్లతో సహా మూడో వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు. అంటే, మూడో వంతు సీట్లలోనే ఎస్సీ, ఎస్టీ మహిళలకు కేటాయించే సీట్లు కూడా ఉంటాయి. అయితే, ఓబీసీ క్యాటగిరీలో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని మాత్రం బిల్లులో ప్రస్తావించకపోవడం గమనార్హం. అలాగే, రాజ్యసభ, శాసన మండళ్లకు ఈ మహిళా రిజర్వేషన్లు వర్తించవు. లోక్‌సభలో ప్రస్తుతం 82 మంది మహిళా సభ్యులు ఉన్నారు. 'నారీ శక్తి వందన్ అధినియమ్' బిల్లు చట్టరూపం దాల్చితే మరో వంద మంది మహిళా ఎంపీలు లోక్‌సభలో అడుగు పెట్టనున్నారు.

(మిగతా 2లో..)



# ఆరు గ్యారంటీలపై..

# ఇంటింటికి ప్రచారం

## కార్యాచరణ సిద్ధం చేస్తున్న పీసీసీ

హైదరాబాద్, : విజయభేరి సభా వేదికగా మూడు రోజుల క్రితం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్మన్ సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అసెంబ్లి ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలతో మరింత ముందుకు దూసుకెళ్లుతోంది. ఈ నెల 17న సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించిన వెంటనే.. మరుసటి రోజు రాష్ట్రంలోని 119 అసెంబ్లి నియోజక వర్గాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సీనియర్లు ఇన్‌చార్జ్‌లు గా వెళ్లి గ్యారంటీలను ఆవిష్కరించి.. కొంత మందికి అందజేశారు. నియోజక వర్గాల్లోని ప్రతి ఇంటికి స్థానిక నాయకత్వం పంపిణి చేయనుంది. ఇప్పటికే రైతు, యువ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, చేయూత పథకం కింద రూ. 4 వేల పెన్షన్ ప్రకటించిన కాంగ్రెస్.. తాజాగా ప్రకటించిన ఆరు గ్యారంటీలపై పల్లెల్లో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రజలకు తెలిసే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించే ఆలోచన చేస్తోంది. పార్టీ నాయకులు పాల్గొని ప్రజలకు వివరించే విధంగా సన్నద్ధమవుతోంది.

(మిగతా 2లో..)

## రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు..

# అక్టోబరు 6న షెడ్యూల్?



**డిసెంబరు తొలివారంలో పోలింగ్**
**వచ్చే నెల 3 నుంచి ఈసీ బృందం పర్యటన**
**వీరి నివేదిక ఆధారంగా ఈసీఐ నిర్ణయం**
**ఓటర్ల జాబితాపై అభ్యంతరాల ప్రక్రియ పూర్తి**
**అక్టోబరు 4న తుది జాబితా విడుదల**

హైదరాబాద్, సెప్టెంబరు 19 : తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికలకు అక్టోబరు 6న షెడ్యూల్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు విడివిడిగా జరుగుతాయని ఇప్పటికే స్పష్టమైంది. దాంతో.. ప్రస్తుత శాసనసభ గడువు ముగిసేలోపే ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వాలి. అంటే.. 2018లో.. డిసెంబరు 7న ఎన్నికలు జరిగాయి. జనవరి 16న శాసనసభ తొలి సమావేశం జరిగింది. దీన్ని బట్టి.. 2024 జనవరి 17లోపు కొత్త శాసనసభ కొలువుదీరాలి. అందుకు అనుగుణంగా ఈ ఏడాది అక్టోబరు మొదటి వారంలో షెడ్యూల్ విడుదలవ్వాలి. ఆ తర్వాత.. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు కనీసం రెండు నెలల సమయం అవసరం.

(మిగతా 2లో..)

## రజినీకాంత్‌కు గోల్డెన్ టికెట్..

**వరల్డ్‌కప్‌కు విశిష్ట అతిథిగా తలైవా**



స్పోర్ట్స్ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ICC World Cup అక్టోబర్ 5 నుంచి మొదలు కానుందని తెలిసిందే. ఈ సారి టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ బిగ్గెస్ట్ క్రికెట్ కార్నివాల్‌కు టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. బీసీసీఐ దేశవ్యాప్తంగా కొంతమంది సెలబ్రిటీలను ఎంపిక చేసి.. వారికి గోల్డెన్ టికెట్స్ అందిస్తుందని తెలిసిందే.

(మిగతా 2లో..)

## కొత్త భవనంలో కొలువు దీరిన పార్లమెంటు



కొత్త పార్లమెంట్ కొలువుదీరింది. కొత్త పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నేటి నుంచి కొత్త భవనంలో జరగనున్న విషయం తెలిసిందే. గణేష్ చతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక పూజ అనంతరం మధ్యాహ్నం 1.15 గంటలకు లోక్ సభ ప్రారంభమైంది. కొత్త భవనాన్ని 'పార్లమెంట్ ఆఫ్ ఇండియా' గా ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త భవనంలో ప్రధాని మోదీ తొలిసారి ప్రసంగించారు. వినాయక చతుర్థిరోజు కొత్త పార్లమెంట్‌లోకి అడుగుపెట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొత్త సభలోకి ఎంపీలందరినీ ఆహ్వానించారు. అమృతకాలంలో కొత్త లక్ష్యాలతో ముందుకెళ్తున్నట్లు ప్రధాని తెలిపారు. 'భవనం మారింది. భావనలు కూడా మారాలి. గత చేదు అనుభవాలను మరిచిపోయి..

(మిగతా 2లో..)

# సింగరేణికి మోదీనే శత్రువు..

## బీజేపీకి డిపాజిట్లు గల్లంతు చేయాలి : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అద్భుత పాలన సాగుతుంటే.. బీజేపీ మాత్రం కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తోందని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం హిందూముస్లింలు అని పంచాయతీలు పెట్టి ఆ మంటలతో చలి కాచుకోవాలనే ప్రయత్నిస్తుందని విమర్శించారు. చాతకాని వాళ్లు మాత్రమే భావోద్వేగాలను రెచ్చగొడుతూ చిల్లరమల్లర రాజకీయాలు చేస్తారని అన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు కోనేరు చిన్న సత్యనారాయణ బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. భవిష్యత్తు మనదేనని, మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినోత్సవంగా అధికారికంగా నిర్వహించి సీఎం కేసీఆర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తే..

(మిగతా 2లో..)

## తెలంగాణపై విషం చిమ్ముతున్న మోదీ : హరీశ్‌రావు



ప్రధాని మోదీ ఎప్పుడు అవకాశం చిక్కినా తెలంగాణ మీద విషం చిమ్ముతున్నారని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లో సంబురాలు చేసుకోలేదని అంటున్నారని.. ఇంతకంటే అన్యాయం ఇంకోటి ఉండదన్నారు. తెలంగాణ ఊరు, వాడా సంబురం చేసుకుందని.. రాష్ట్ర ఏర్పాటు కావడంతోనే దేశంలోనే తెలంగాణ తలసరి ఆదాయం నంబర్ వన్‌గా ఉందని హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్‌లో డబుల్ లైన్ రోడ్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడంతో పాటు గ్రంథాలయం ప్రారంభించారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే తెలంగాణలోని ప్రతి ఒక్కరూ సంతోషపడ్డారని, పండుగ చేసుకున్నారన్నారు. కానీ, మోదీ మాత్రం పండగ చేసుకోలేదని కడుపులో విషం కక్కుతున్నారని ఆరోపించారు. వేరుపడ్డ తొలి రోజుల్లోనే 7 మండలాలు ఏపీలో కలిపి తెలంగాణకు అన్యాయం చేశారని, లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్ట్ ఆంధ్రాకు అప్పజెప్పి మోదీ తెలంగాణకు మోసం చేశారన్నారు.

# పేదవారికి అండగా

### టీడీపీ జాతీయ కార్యదర్శి, కాసాని వీరేష్ బాబు



వికారాబాద్ ఈరోజు ప్రతినిధి: కుల్కచర్ల గ్రామానికి చెందిన శివని వెంకప్ప మృతి చెందగా విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, పరిగి ఇంచార్జ్ కాసాని వీరేష్ బాబు అంత్యక్రియల కోసం మృతుడి కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామన్న మాదిగ ,బాలకృష్ణ, వెంకటయ్య, బాబు, దస్తయ్య, నర్సింలు, , రాములు, బిమయ్య కాసాని యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# తెలుగు రాష్ట్రాలకు వర్షాలు..

### అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కురిసే అవకాశం.



డిల్లీ సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: మళ్లీ రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు తప్పేలా కనిపించడం లేదు. ఎందుకంటే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల అవకాశాలు ఉన్నాయి. మరో 24 గంటల్లోనే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది.ఇప్పటికే ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ఆవర్తనం పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి ఆనుకొని ఉంది. ఆవర్తన ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో రేపటికి అల్పపీడనం ఏర్పడుతుందని ప్రకటించింది భారత వాతావరణం శాఖ.వీటి ప్రభావంతో మూడు రోజుల పాటు కోస్తాలో రాయలసీమలో తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయని ఐఎండీ ప్రకటించింది. రాయలసీమలోనూ చెదురుమదురు వర్షాలు కురుస్తాయి.

# ఆరు గ్యారంటీలపై.. ఇంటింటికి ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటకలో అయితు హామీల గ్యారంటీ కార్డు ప్రకటించడంతో.. అక్కడి ఎన్నికల్లో ఆ హామీలు తీవ్ర ప్రభావం చూపినందున అధికారంలోకి వచ్చిందని, తెలంగాణలోనూ ఆరు గ్యారంటీలతో పాటు వివిధ రకాల డిక్లరేషన్లతో అధికారంలోకి వస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రణాళిక బద్దంగా వెళ్లి.. ఓటర్లను ఆకర్శించే విధంగా పార్టీ కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది.ప్రధానంగా మహాలక్ష్మి పేరుతో మహిళలకు ప్రతి నెల రూ. 25,00, ఆర్టీస బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ లాంటీ హామీలను మహిళా ఓటర్లను ప్రభావితం చేస్తాయని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. యువ వికాంస పేరుతో విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యాభరోసా కార్డు, ప్రతి మండల కేంద్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలల ఏర్పాటు పథకాలు యువతపై ప్రభుత్వం చూపుతాయని పీసీసీ భావిస్తోంది.ఇక రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు ఏటా ఎకరాకు రూ. 15 వేల పెట్టుబడి సాయం, వ్యవసాయంపై ఆధారపడి జీవినం సాగించే రైతు కూలీలకు ప్రతి ఏటా రూ. 12 వేలు, వరి పంట పండించే రైతులకు మద్ధతు ధరకు అదనంగా మరో రూ. 500 బోనస్ కింద చెల్లిస్తారు. ఇవి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే రైతులను, రైతుపై ఆదారపడి జీవనం సాగించే కూలీలను కాంగ్రెస్ వైపు మళ్లించేందుకు దోహదం చేస్తాయని పీసీసీ అంచనా వేస్తోంది.

పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి.. ఉచితమని ప్రకటనతో.. ఆ కేటగిరికి వచ్చే కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతారని భావిస్తున్నారు. ఇక చేయూత పేరుతో వృద్ధులు, వికలాంగులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలతో పాటు అర్హులైన వారికి నెలకు రూ. 4 వేల పెన్షన్, రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా కంద రూ. 10 లక్షల వరకు ప్రయాటటజనం, ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ. 5 లక్షల ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి జాగా ఇస్తామన్న హామీలు ఆకర్శించే విధంగా ఉన్నాయని హస్తం పార్టీ నాయకులు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో, రద్దీ కూడల్లో విస్తృత ప్రచారం..

అసెంబ్లి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో 17 పార్లమెంట్ నియోజక వర్గాలకు కాంగ్రెస్ అధిష్టానం నియమించిన పరిశీలకుల ద్వారా ఈ ఆరు హామీల గ్యారంటీ కార్డును జనంలోకి తీసుకెళ్లేందుకు కసరత్తులు చేస్తోంది. కరపత్రాలు, గోడ పత్రాలు, ఫ్లెక్సీలు, గోడరాతలు, ఇలా వివిధ రకాలుగా వాటిని గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. డీసీసీ అధ్యక్షులను, అసెంబ్లి నియోజక వర్గాల ఇంచార్జ్ బాధ్యత వహిస్తున్న ప్రధాన కార్యాదర్శులను, పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా నియమితులైన ఏఐసీసీ పరిశీలకులను, పీసీసీ ఉపాధ్యక్షులను, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లను భాగస్వామ్యం చేసి నియోజక వర్గ స్థాయి నాయకుల ద్వారా, పోలింగ్ బూతుల వారీగా వాటిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఎక్కువ మంది జనం చూడగలిగే ప్రాంతాల్లో పెద్ద, పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, గోడలపై రాతలు రాయించడం, ఇంటి తలపులపై ఆరు గ్యారంటీలకు చెందిన పోస్టర్లు అంటించడం, పెద్ద సంఖ్యలో కరపత్రాలను రద్దీ ప్రదేశాల్లో పంపిణి చేయడం లాంటివి చెపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ విషయంపై పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితర కమిటీ సభ్యులు దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# అక్టోబరు 6న షెడ్యూల్?

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కేటీఆర్ కూడా “అక్టోబరు 10లోపు షెడ్యూల్ విడుదలవ్వాలి. అంతకు మించి ఆలస్యం జరిగితే.. ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతాయి” అంటూ ఈ మధ్య ఎక్స్ వేదికగా అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అక్టోబరు మొదటి వారంలోనే షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశాలున్నట్లు స్పష్టమవుతుంది. భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) తరపున రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలనకు ప్రత్యేక బృందం రానుంది. అక్టోబరు 3, 4, 5 తేదీల్లో ఈ బృందం రాష్ట్రంలో పర్యటించనుంది.రాష్ట్రంలో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది, పోలీసు బందోబస్తు వంటి పలు అంశాలను పరిశీలించనుంది. ఈ పరిశీలన పూర్తయిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేక నివేదికను సమర్పించనుంది. ఆ నివేదిక అందిన వెంటనే ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం అక్టోబరు 6న ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వేళ ఆ తేదీన కుదరకపోతే.. అక్టోబరు 10వ తేదీలోపు షెడ్యూల్‌ను జారీ చేస్తారని భావిస్తున్నారు. షెడ్యూల్ జారీ అయిన నెల తర్వాత నోటిఫికేషన్‌ను విడుదల అవుతుంది. ఆ తర్వాత.. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్ల పర్వం ప్రారంభమైన నెల రోజుల్లో ఎన్నికల ప్రక్రియను ముగించాలి. కేంద్ర బృందం పర్యటనకు సంబంధించి రాష్ట్ర అధికారులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తిచేశారు. అటు ఓటర్ల జాబితా రెండో సవరణలో భాగంగా అభ్యర్థనలు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను మంగళవారం ముగించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 వరకు కొత్త ఓటర్ల నమోదుకు 13.06లక్షల దరఖాస్తులు, పేర్ల తొలగింపునకు 6.26 లక్షల అర్జీలు అందాయి. సవరణలకోసం 7.77 లక్షల దరఖాస్తులు అందినట్లు ఎన్నికల విభాగం అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను ఈనెల 27 లోపు పరిష్కరించి.. అక్టోబరు 4న తుది జాబితాను విడుదల చేస్తారు. గడువు ముగిసినప్పటికీ.. పౌరులు ఎప్పుడైనా దరఖాస్తులు పంపే వెసులుబాటు ఉందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) కార్యాలయం వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 14.72 లక్షలమంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారని, 18-19 ఏళ్ళ వయసున్న ఓటర్లు జనవరి 5 నాటికి 2.79 లక్షలుండగా, మంగళవారం వరకు 6.51 లక్షలకు పెరిగినట్లు తెలిపింది. మొత్తం ఓటర్లు 3.13 కోట్లు ఉన్నారని, ఇందులో పురుషుల సంఖ్య 1.57 కోట్లు కాగా.. మహిళల వాటా 1.56 కోట్లు, ఇతరులు 2,226 మంది ఉన్నారు. వివిధ కారణాల వల్ల 3.39 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించారు.

# సింగరేణికి మోదీనే శత్రువు..

(మొదటి పేజీ తరువాయి)

ఇది నచ్చని కేంద్ర ప్రభుత్వం ఇక్కడికి వచ్చి జెండా ఎగురవేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టే విధంగా వ్యవహరిస్తుందని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. సమాజాన్ని కుల, మత పరంగా చీల్చి ప్రజల మధ్యలో ఉద్రిక్తతలు, వైషమ్యాలు రెచ్చగొట్టి హిందువు, ముస్లిం అని పనికిమాలిన పంచాయతీలు పెట్టి ఆ మంటలతో చలి కాచుకోవాలని దౌర్భాగ్యపు రాజకీయం చేస్తుంది నరేంద్రమోదీ ప్రభుత్వమని విమర్శించారు. సింగరేణికి మోదీయే శత్రువని ఆరోపించారు. సింగరేణిని ముంచే ప్రయత్నం చేస్తోంది బీజేపీ అని అన్నారు. మోదీ ప్రభుత్వం తెలంగాణకు గత 9 సంవత్సరాలుగా అన్యాయమే చేసిందన్నారు. తెలంగాణ ఏర్పడి ఏర్పడక ముందే ఏడు మండలాలను గుంజుకుందని, సీలేరు విద్యుత్ ప్రాజెక్టును తీసుకుందన్నారు. ఫాసిస్టు దోరణిలో, నిరంకుశమైన ధోరణితో ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఒక్కొక్కరికి రూ. 15 లక్షలు వేస్తామని చెప్పారని.. అయితే మాటలు తప్ప చేతలు లేవన్నారు. ప్రజలు కూడా మోదీ భ్రమల్లో నుంచి బయటపడుతున్నారని కేటీఆర్ అన్నారు. కానీ సీఎం కేసీఆర్ చెప్పకుండానే, ఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో 73 వేల కోట్లు రైతు బంధు ద్వారా జమ చేశారన్నారు. స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పటి వరకు ఇలాంటి స్కీం ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ లాంటి నేత దేశంలో మరెవ్వరూ లేరన్నారు.

**కిషన్ రెడ్డి కేటీఆర్ సవాల్**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నిరుద్యోగ సమస్య గురించి ఇక్కడ దీక్ష చేస్తాడని, ఆయనకు సిగ్గు శరం, లజ్జ , పౌరుషం, చీము నెత్తురు ఉంటే నరేంద్రమోదీ ఇంటి ముందు ధర్నా చేయాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, కొత్తవి ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ప్రధానిని చేస్తే పెట్రోల్ ధరలు తగ్గిస్తా అని మోదీ చెప్పారని.. కానీ లీటరు ధర ఇప్పుడు వంద దాటేసిందన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.400 ఉన్నప్పుడు ధరలు తగ్గిస్తామని చెప్పి రూ.1200 చేర్చారన్నారు. నరేంద్రమోదీకి, ఆ పార్టీకి డిపాజిట్లు గల్లంతు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.. రూపాయి విలువ గురించి, అధికారంలో లేనప్పుడు చాలా మాటలు మాట్లాడిన మోదీ ఇప్పుడు వేటికి సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ అల్లర్ల గురించి మాట్లాడరు కానీ మతం పేరుతో చిల్లర రాజకీయాలు చేయాలని చూస్తారని మండిపడ్డారు. బీజేపీ నేత గూడూరు నారాయణ రెడ్డి రజాకార్ అనే సినిమా తీశారని, హిందూముస్లింలు చంపుకునేది చూపెట్టే పాత గాయాలను మళ్లీ రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్ ఇలా ప్రజలను రెచ్చగొడుతుంటారని ఆరోపించారు. చాతకాని వాళ్లు మాత్రమే భావోద్వేగాలను రెచ్చగొడుతూ చిల్లరమల్లర రాజకీయాలు చేస్తారన్నారు. 2022 వరకు బుల్లెట్ ట్రైన్ తీసుకొస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఇండ్లు, 5 ట్రిలియన్ ఎకానమీ అవుతుందని, ఇంటింటికి నల్లా నీరు ఇస్తామని చెప్పారని, ఇవేవి అమలు చేయరు.. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గురించి అడిగితే మాట్లాడలేని దద్దమ్మలు నోటికొచ్చినట్లు వాగుతున్నారని అన్నారు. దిగజారిపోయిన ప్రధానమంత్రి, ఆయన పార్టీ ఒక వైపు ఉందన్నారు.

# రజినీకాంత్‌కు గోల్డెన్ టికెట్..

(మొదటి పేజీ తరువాయి)

వీటిలో ఓ గోల్డెన్ టికెట్‌ను తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ అందుకున్నారు. బీసీసీఐ సెక్రటరీ జైషా తలైవాకు టికెట్ అందజేస్తున్న స్టిల్‌ను అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేశారు.మరో పదిహేను రోజుల్లో స్వదేశంలో జరుగనున్న వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జోరుగా ఏర్పాట్లు చేస్తున్నది. సొంతగడ్డపై జరుగనున్న మెగాటోర్నీకి సౌతిండియా సూపర్ స్టార్ రజినీకాంత్‌ను విశిష్ట అతిథిగా ఎంపిక చేసింది. దీంతో పాటు టోర్నీలో ఏ మ్యాచ్‌కైనా వీక్షించే విధంగా తలైవాకు గోల్డెన్ టికెట్ కేటాయించింది.

# కొత్త భవనంలో కొలువు దీరిన పార్లమెంటు

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చేలా పనిచేయాలి’ అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, మరికాసేపట్లో లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లును న్యాయమంత్రి అర్జున్ మేఘ్వాల్ సభ్యుల ముందు ఉంచనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రాజ్యసభ ప్రారంభం కానుంది.

# మహిళకు వందనం!



(మొదటి పేజీ తరువాయి)

అప్పుడు అనివార్యంగా వారి సంఖ్య 181కు పెరగనుంది. 15 ఏళ్లపాటు ఈ రిజర్వేషన్ అమల్లో ఉంటుంది. ఆ తర్వాత మరింత కాలానికి పెంచుకునే అవకాశమూ ఉంటుంది. అంతేనా, నియోజకవర్గాల పునర్విభజన జరిగిన ప్రతిసారీ అప్పటి మహిళా ఓటర్ల సంఖ్యను బట్టి రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్‌ను అమలు చేస్తారు. కేంద్రపాలిత ప్రాంతమైనా.. ఢిల్లీ అసెంబ్లీలోనూ మహిళా రిజర్వేషన్ అమలు జరుగుతుందని బిల్లులో పేర్కొన్నారు. నిజానికి, మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఆమోదించడానికి ఇప్పటి వరకూ చాలా ప్రయత్నాలే జరిగాయి. తొలుత, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి రాజీవ్ గాంధీ హయాంలో 1989లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టారు. ఇది లోక్‌సభలో ఆమోదం పొందింది. కానీ, రాజ్యసభలో ఆమోదం పొందలేదు. ఆ తర్వాత, 1992లో పీవీ నరసింహారావు 73, 74 రాజ్యాంగ సవరణ బిల్లుల ద్వారా పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఆ తర్వాత చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును తొలుత దేవెగౌడ సర్కారు 1996లో ప్రవేశపెట్టింది. ఉభయ సభల సంయుక్త కమిటీకి దానిని నివేదించారు. ఆ తర్వాత చట్టసభల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చాలా ప్రయత్నాలు చేశాయి. కానీ, అవి సంకీర్ణ ప్రభుత్వాలు కావడం.. ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలు వ్యతిరేకించడంతో బిల్లు చట్టరూపం దాల్చలేదు. చివరిసారిగా, 2010లో ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. కానీ, లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఇప్పుడు మరోసారి ఈ బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది.

**అమలు ఐదేళ్లు ఆలస్యమే!**

కేంద్ర ప్రభుత్వం హడావుడిగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి.. మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టినా.. మహిళలకు ఈ రిజర్వేషన్లు ఇప్పటికిప్పుడు అమల్లోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు! త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కానీబీ ఆ తర్వాత వచ్చే ఏడాది ఏప్రిల్-మేల్లో జరిగే సాధారణ ఎన్నికల్లో కానీ మహిళా రిజర్వేషన్లు వర్తించవు. కాంగ్రెస్ సహా ప్రధాన ప్రతిపక్షాల్లో అత్యధికం సుముఖంగా ఉండడంతో పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనే ఉభయ సభల్లోనూ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందనుంది. ఆ తర్వాత, దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు మహిళా బిల్లుకు ఆమోదం తెలపాల్సి ఉంది. బీజేపీ, కాంగ్రెసతోపాటు మరికొన్ని ప్రతిపక్షాలు కూడా బిల్లుకు సుముఖంగా ఉండడంతో రాష్ట్రాల అసెంబ్లీల్లో ఆమోదం పొందడమూ పెద్ద కష్టం కాదు. ఇక, రాష్ట్రపతి అంగీకారం లాంఛనమే. అంటే, మరికొద్ది రోజుల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు చట్ట రూపం దాల్చనుంది. కానీ, ఈ బిల్లు అమల్లోకి వచ్చేది కనీసం ఐదేళ్ల తర్వాతే. ఇందుకు కారణం.. జన గణనకు, నియోజకవర్గాల పునర్విభజనకు బిల్లులోనే లింకు పెట్టడమే! మహిళా రిజర్వేషన్ల అమలుకు నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని బిల్లులోనే పేర్కొన్నారు. అది కూడా, ఈ బిల్లు చట్ట రూపం దాల్చిన తర్వాత జరిగే తొలి జన గణనలో వచ్చిన గణాంకాల ఆధారంగా చేపట్టాలని నిర్దేశించారు. నిజానికి, 2021లోనే జన గణన జరగాల్సి ఉంది. కొవిడ్ కారణంగా అది వాయిదా పడింది. ఇప్పుడు ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఏడాదిలోనో, రెండేళ్లలోనో జన గణన జరుగుతుందని అనుకుందాం. ఆ గణాంకాల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడతారు. నిజానికి ఇది 2026లో జరగాల్సి ఉంది. ఇది షెడ్యూలు ప్రకారం జరుగుతుందా!? ఆలస్యం అవుతుందా!? అనే అంశం ప్రస్తుతానికి అనూహ్యం. నియోజక వర్గాల పునర్విభజన ఎప్పుడు జరిగితే అప్పుడు మహిళా ఓటర్ల సంఖ్యను బట్టి నియోజక వర్గాల్లో మూడో వంతు మహిళలకు కేటాయిస్తారు. ఆ తర్వాత మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తారు. దీని ప్రకారం.. దాదాపుగా 2027 తర్వాత వచ్చే ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉదాహరణకు, తెలంగాణలో అయితే 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనూబీ జాతీయ స్థాయిలో అయితే 2029 సాధారణ ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు జరిగే అవకాశం ఉంది.

# స్వచ్ఛతపఖ్వాడా డ్రైవ్ ను చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే

## అదనపు జనరల్ మేనేజర్ ఆర్. ధనంజయులు ద్వారా స్వచ్ఛతా ప్రతిజ్ఞ మరియు సంతకాల ప్రచారం









హైదరాబాద్ సెప్టెంబర్ 19ఈరోజు ప్రతినిధి: దక్షిణ మధ్య రైల్వే 'స్వచ్ఛ రైలు స్వచ్ఛ భారత్' మిషన్‌లో భాగంగా 16 సెప్టెంబర్ నుండి 02 అక్టోబర్ , 2023 వరకు ) స్వచ్ఛత పఖ్వాడా (పక్షం రోజులు స్వచ్ఛత ) డ్రైవ్ ను చేపట్టింది. ఇందులో భాగంగా, ఈరోజు అనగా సెప్టెంబర్ 19 , 2023న సికింద్రాబాద్ లోని రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ ఆర్. ధనంజయులు గారు అధికారులు మరియు సిబ్బంది చేత స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. దీనితోపాటు సిబ్బందిని మరింత చైతన్యవంతం చేసేందుకు మరియు పరిశుభ్రతా డ్రైవ్‌లో చురుకైన భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి అదనపు జనరల్ మేనేజర్ గారి నేతృత్వంలో సంతకాల ప్రచారం కూడా జరిగింది. స్వచ్ఛతబిపఖ్వాడా ప్రచారంలో భాగముగా ప్రజలలో, రైలు వినియోగదారులలో మరియు రైల్వే సోదరులలో 'స్వచ్ఛ రైల్ స్వచ్ఛ భారత్' మిషన్ యొక్క ప్రాముఖ్యతపై అవగాహన తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా, రైల్వే స్టేషన్లు, రైళ్లలో మరియు రైల్వే కార్యాలయాల వద్ద పరిశుభ్రత స్థాయిని మరింత మెరుగుపరిచేందుకు పక్షం రోజుల డ్రైవ్‌లో అనేక కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించారు. మంచి పరిశుభ్రత అలవాట్లను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృతమైన అవగాహన ప్రచారాలు కూడా నిర్వహించబడతాయి. స్వచ్ఛతబిపఖ్వాడా కార్యకలాపాలలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ %డ% స్వచ్ఛ అవగాహన, స్వచ్ఛ సంభాషణ(ప్రజలతో అవగాహన మరియు పరిశుభ్రతకు గురించిన సంభాషణలు), స్వచ్ఛ స్టేషన్లు (క్లీన్ రైల్వే స్టేషన్లు), స్వచ్ఛమైన రైలు (క్లీన్ రైళ్లు), స్వచ్ఛ రైల్వే మార్గము(క్లీన్ రైల్వే ట్రాక్స్), స్వచ్ఛ కార్యాలయం, స్వచ్ఛ కాలనీలు పరిసరాలు(క్లీన్ వర్క్ ప్లేస్,కాలనీలు ఆవరణలు), స్వచ్ఛ ఆహారం (శుభ్రమైన ఆహారం), స్వచ్ఛ నీర్ (స్వచ్ఛమైన నీరు), స్వచ్ఛ జలాశయం పార్క్, స్వచ్ఛ ప్రసాదన్ పరిసరాలు ( క్లీన్ టాయ్లెట్ లు మరియు పరిసరాలు ) స్వచ్ఛస్పర్ధ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం మరియు పరిశుభ్రత అలవాట్లను పాటించడం గురించి ప్రజలకు అవగాహన స్వచ్ఛ ప్రచారం మరియు స్వచ్ఛత అవగాహన ర్యాలీ మొదలైన కార్యకలాపాలు ఉన్నాయి. స్వచ్ఛతబిపఖ్వాడా ప్రచారం అక్టోబర్ 2023 02 న ముగుస్తుంది మరియు మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని సేవ దివాస్ (సమాజ సేవా దినోత్సవం) గా జరుపుకుంటా. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ ఆర్.ధనంజయులు మాట్లాడుతూ స్వచ్ఛతా ప్రతిజ్ఞకు కట్టుబడి స్వచ్ఛత ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని సిబ్బందికి సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగస్వాములయ్యేలా తమ కుటుంబాలు, ఇరుగుపొరుగు వారిని ప్రోత్సహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.

ఇంట్లో ఉన్నా, పని ప్రదేశంలో ఉన్నా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి వ్యక్తి వారానికి 2 గంటల చొప్పున కనీసం 100 గంటలు పరిసరాల పరిశుభ్రత కోసం కేటాయించాలని ఆయన నొక్కి చెప్పారు.

## బిఆర్ఎస్ ఫస్ట్ లిస్టులో మార్పులు ఉంటాయా?



హైదరాబాద్ సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తోన్న వేళ అధికార బీఆర్ఎస్ పార్టీ అందరికంటే ముందే అభ్యర్థులను ప్రకటించి దూకుడు ప్రదర్శించిన విషయం తెలిసిందే. మొత్తం 115 మందితో తొలి జాబితాను వెల్లడించారు.దాదాపు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి సీట్లు కేటాయించారు. అయితే ఈ జాబితాలో కేవలం ఏడుగురు మహిళలకే అవకాశం కల్పించారు. దీంతో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్సీ కవితపై విపక్షాల నుంచి సోషల్ మీడియా నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రధాని నరేంద్ర మోడీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనిని ఇవాళ మంగళవారం సభలో ప్రవేశపెట్టారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రభుత్వం తీసుకువస్తుందని చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించబడతాయి. ఇదే జరిగితే రానున్న ఎన్నికల్లో ఇప్పటికే చాలా ప్లాన్‌లు వేసుకున్న చాలా రాష్ట్రాల లెక్కలు తారుమారు కానున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో మార్పులు అనివార్యంగా మారింది. అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు అంటే దాదాపు 40 సీట్ల వరకు కేటాయించాల్సి ఉంటుంది.

## బిచ్చగాడు హీరో కుమార్తె ఆత్మహత్య.



చెన్నై సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: బిచ్చగాడు మూవీ హీరో కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. నటుడు విజయ్ ఆంటోని కుమార్తె లారా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఒత్తిడి కారణంగా 12వ తరగతి చదువుతున్న లారా ఆత్మహత్యకు పాల్పడినట్లు తమిళనాడు ఆళ్వార్‌పేట పోలీసులు తెలిపారు.లారా ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.విజయ్ ఆంటోని కూతురు లారా చెన్నైలోని ఓ ప్రముఖ ప్రైవేట్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతోంది. చెన్నైలోని డీడీకే రోడ్‌లోని తన ఇంట్లో సెప్టెంబర్ 19వ తేదీ తెల్లవారుజామున లారా ఉరి వేసుకుని కనిపించినట్లు సమాచారం. దీంతో ఆమెను వెంటనే చెన్నై ఆళ్వార్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. లారా మరణ వార్త విని సినీ ప్రముఖులు, లారా స్నేహితులు సంతాపాన్ని ప్రకటించారు. విజయ్ ఆంటోనికి 2006 పెళ్లయింది. ఫాతిమా అనే మహిళను ఆయన వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె లారా, కుమారుడు ఉన్నారు.

## బెయిల్ మంజూరు కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా అధికార ప్రతినిధి మండేపూడి శ్రీనివాసరావు



వైరా డివిజన్ సెప్టెంబర్ 19ఈరోజు ప్రతినిధి: నారాచంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ వారికి వెంటనే బెయిల్ మంజూరు కావాలని అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ సింగరేణి మండలం వైరానియోజవర్గం కారేపల్లి పెద్దమ్మతల్లి దేవాలయంలో జిల్లా అధికార ప్రతినిధి మండేపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించటం జరిగింది. మండేపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ లో పేరు లేని చంద్రబాబు నాయుడుని కావాలనే అక్రమంగా అరెస్టు చేయడం జగన్ ప్రభుత్వం మొండి వైఖరి అని స్కిల్ డెవలప్మెంట్ వ్యవహారంలో అక్రమంగా ఇరికించడం జరిగిందని తీవ్రంగా ఖండించారు. వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలనాయకులు కాసాని లక్ష్మీనారాయన,యండి యాకూబ్, కంచిరమేశ్ ,కొండల్రావు,చిన్ని శ్రీను, అలెము వెంకటేస్వర్లు, బి.ముఖర్జీ, గంగరబోయిన శ్రీనివాసరావు, చేరుకూరి రామారావు,సాయిన్ని సైదయ్య, రామకృష్ణ,డి సక్రు,ముప్పారపు వెంకటేస్వర్లు, కొత్త తీరపయ్య, కోటాచారి, పొలురి రామారావు,దూలిపళ్ల,బాస్కరావు, యెల్ నరేశ్, జీ. నరేష్ ,డి వెంకటేశ్వర్లు,టి.వెంకటేస్వరులు, గుడిపూడి నాగేశ్వరరావు,మంగిలాలు, వడ్డె అనంతయ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సమస్యలు పరిష్కరించటంలో పూర్తి గా విఫలం

### అంగన్వాడి ప్రాజెక్టు నాయకురాలు చావా పద్మ




మధిర సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సి ఐ టి యు రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా 9వ రోజు మధిర లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మానవహారం అనంతరం కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా చాలా పద్మ మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు, ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని అయినవారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేదని, కనీస వేతన చట్టం అమలు పరచడం లేదని, అదనపు పనికి వేతనం ఇవ్వటం లేదని పేర్కొన్నారు. అంగన్వాడి ఉద్యోగులను ఆయాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, అదనపు, పనికి అదనపు వేతనం ఇవ్వాలని రాజకీయ ఒత్తిడి లను నివారించాలని, పని భారాన్ని తగ్గించాలని ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించాలని ఇప్పటివరకు తొమ్మిది రోజుల పాటు సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి కళ్ళు లేవని ఆమె అన్నారు... సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, సిఐటియు మధిర టౌన్ కన్వీనర్ పడకంటి మురళి, సిఐటియు మండల నాయకులు వడ్రానపు మధు, అంగన్వాడీ టీచర్స్, మినీ వర్కర్స్ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఉయ్యాల గణపతి మట్టి విగ్రహం



ఖమ్మం పార్శిబంధం సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: 21 డివిజన్ లో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఉయ్యాల గణపతి మట్టి విగ్రహంతో 21వ వార్షికోత్సవమును ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు పిల్లలమర్రి వెంకట్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి భాధ్యత . ప్రజలందరూ , మట్టి గణపతి ని పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలి వినాయక చవితి సందర్భంగా ప్రజలకి మట్టి గణపతి . ఆ విగ్నేశ్వరుడు అందరికి ఆయురారోగ్యాలు అష్ట ఐశ్వర్యాలు ప్రసాధించాలని కోరుతూ మట్టి గణపతి ఉయ్యాల గణపతికి పూజా చేయడం జరిగింది . అందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు . కమిటీ సభ్యులు పిల్లలమర్రి వెంకట్ , మందనరేష్ , మారం క్రాంతి , ఉదారపు వీరభద్రం , ఉదరాపు ఉపేందర్ , మిరియాల పరుశురాం , దాసరి వంశీ , పిల్లలమర్రి తారక , పిల్లల మర్రి హరికృష్ణ , రంగ సునీల్ , ఉదరపు నగేష్ , పెండెం వెంకటరమణ , కల్లూరి లింగా చారి , మాణిక్యాల విప్లవ్, చెరుకుపల్లి ఉప్పలయ్య మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బందికి శిక్షణా శిబిరం




హైదరాబాద్ సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: రాష్ట్రంలో రానున్న శాసనసభ ఎన్నికల సన్నాహక చర్యల్లో భాగంగా ఎన్నికలవిధులు నిర్వర్తించే ఈవీఎం నోడల్ అధికారులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిబ్బందికి ఈరోజుఎన్నికల ప్రధాన కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరిగింది . అదనపు ఎన్నికల ప్రధానాధికారిశ్రీ ఎల్. లోకేష్ కుమార్ శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగించారు ఈవీఎంలు, వివి పాట్ యంత్రాల నిర్వహణ, సాంకేతిక విషయాలు , ఓటింగుకుముందు, వోటింగ్ సమయంలో , వోటింగ్ పూర్తి అయిన తరువాత వాటిని నిర్వహించేపద్ధతులు , ప్రకియలపై సీనియర్ అధికారులతోపాటు , వోటింగ్ యంత్రాల తయారీ సంస్థఅయిన ఈసి ఐ ఎల్ కు చెందిన



ఇంజనీర్లు శ్రీ సుకంత కుమార్ భోళా , శ్రీ కె. నితిన్ కుమార్‌లు సిబ్బందికి అవగాహన కల్పించారుసీలు తీసే సమయంలో , సీలు వేసిన తరువాత వోటింగ్ యంత్రాల నిర్వహణ , భద్రత,కౌంటింగ్ లపై కూడా సిబ్బందికి ఆచారణాత్మకంగా వివరించారు. వోటింగ్ ప్రకియ చేపట్టే ప్రతిదశ లోనూ రాజకీయ పార్టీల పర్యవేక్షణకు సంబంధించి కూడా సిబ్బందికి విశదీకరించారు.అలాగే మొత్తం పోలింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయడం లోని సూక్ష్మతలను శిక్షణలోభాగంగా అవగాహన కల్పించారు.

## ఓటర్ల జాబితా సవరణ

హైదరాబాద్ సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: 2023 సంవత్సరానికి చేపట్టిన ఓటర్ల జాబితా రెండవ సవరణలో అభ్యర్థనలు, అభ్యంతరాల స్వీకరణ ఘట్టం ఈ రోజు(సెప్టెంబరు, 19)తో ముగిసింది. అర్హులైన పౌరులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునే ప్రక్రియ(ఫార-6), ఓటర్ల జాబితానుంచి చనిపోయిన వారు, చిరునామా మారిన వారి పేర్లుతొలగించే ప్రక్రియ(ఫారం-7), ఓటర్ల జాబితాలో వివరాలలో సవరణలు చేసే ప్రక్రియ (ఫారం-8) కింద అభ్యర్థనలు, అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు ప్రకటించిన తరువాత... మొత్తం రాష్ట్రంలో ఈ నెల 18 వరకు-కొత్త ఓటర్ల నమోదుకు 13.06లక్షల దరఖాస్తులు, పేర్ల తొలగింపునకు 6.26 లక్షల దరఖాస్తులు, వివరాల సవరణకోసం 7.77 లక్షల దరఖాస్తులు అందాయి. అలాగే ఈ సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు 14.72 లక్షలమంది కొత్తగా ఓటర్లుగా నమోదు కాగా, 3.39 లక్షల మందిని తొలగించారు. 10.95 లక్షలమంది ఓటర్ల వివరాలలో మార్పులు చేసారు. ఈ మార్పుచేర్పుల ఫలితంగా - ఓటర్ల జాబితాలో మొత్తం 3.13 కోట్లు ఉన్నట్లు, వీరిలో 1.57 కోట్లమంది పురుషులు కాగా, 1.56 కోట్లమంది స్త్రీలు, 2226 మంది ఇతరులు ఉన్నట్లు తేలింది. దీనితో స్త్రీ పురుష నిష్పత్తి 994గా, ఓటరు, జనాభా నిష్పత్తి (2023 వరకు) 696గా తేలింది.కొత్తగా చేరిన యువ ఓటర్లలో చెప్పుకోదగిన మార్పు కనపించింది. జనవరి 5, 2023 నాటికి 18-19 ఏళ్ళ వయసున్న ఓటర్లు 2.79 లక్షలుండగా, 19 సెప్టెంబరు నాటికి 6.51 లక్షలకు అంటే 234 % పెరిగింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి శ్రీవికాస్ రాజ్ నిరంతర పర్యవేక్షణలో 33 జిల్లాల ఎన్నికల అధికారులు రాత్రింబవళ్లు చెమటోడ్చడం వల్లనే ఇది సాధ్యమయింది. 18-19 ఏళ్ళ మధ్య స్త్రీ పురుష ఓటర్ల నిష్పత్తి 717 గా ఉండడం కొంత ఆందోళన కలిగించే విషయం. ఈ పరిస్థితిని మెరుగు పరచడానికి జిల్లా ఎన్నికల అధికారులు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ఈ నెల 19 వరకు అందిన దరఖాస్తులన్నింటినీ ఈనెల 27 లోగా పరిష్కరించి ఖరారయిన తుది జాబితాను అక్టోబర్, 4న ప్రకటించడం జరుగుతుంది. అభ్యర్థనలు, అభ్యంతరాలకు గడువు ముగిసినప్పటికీ, అర్హులైన పౌరులు తమ దరఖాస్తులను ఎప్పుడయినా పంపుకోవచ్చని ఎన్నికల జాబితా సవరించిన ప్రతిసారీ వాటిని పరిష్కరించడం జరుగుతుందని ..తెలంగాణ రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి ఒక పత్రిక ప్రకటనలో తెలియ చేసారు.

## సేవా దృక్పథంతో మరోసారి మానవత్వం చాటుకున్న పాలడుగు



ఇబ్రహీంపట్నం మండలం సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: గుంటుపల్లి గ్రామం అంబేత్కర్ నగర్ నందు మెరుగుమాల గోవింద్ ప్రమాదవశాత్తు ఏక్సిడెంట్ జరిగి మరణించారు విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం మండల వైఎస్ఆర్సిపి నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్ గోవింద్ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోవింద్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి గోవింద్ మట్టి ఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి గ్రామ వైఎస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈరోజు
సంపాదకీయం
బుధవారం 20, సెప్టెంబరు 2023

## ఎజెండా లేకుండానే సమావేశాలా?

ఎన్నికలు, ప్రభుత్వ వ్యతిరేకత, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కేంద్రం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నది. జమిలి ఎన్నికల చర్చ పేరుతో రాజకీయ లబ్ధి, ఎన్నికల కమిషనర్ల నియామకంలో అస్మదీయుల నియామకానికి చట్ట సవరణ చేయాలని చూస్తున్నది. ఇవి తప్ప75వ స్వాతంత్ర్య అమృతోత్సవాల వేళ కనీసం ఈ ఒక్క సమావేశాల్లోనైనా రాజ్యాంగ రూపకర్తల ఆశయం మేరకు పనిచేయాలన్న సోయి ఏమాత్రం కేంద్రానికి ఉన్నట్టు కనిపించడం లేదు.ప్రస్తుతం దేశం ఎన్నో కీలక సమస్యలను ఎదుర్కొంటున్నది. నిత్యావసర ధరల పెరుగుదలకు కారణమైన ద్రవ్యోల్బణం, పెరుగుతున్న నిరుద్యోగం, రికార్డుస్థాయిలో పెరిగిన దేశం అప్పులు ఉండనే ఉన్నాయి. హైవేల నిర్మాణంలో తప్ప ఎక్కడా కానరాని అభివృద్ధి, చట్ట సభల్లో మహిళలకు, బలహీన వర్గాలకు 33 శాతం రిజర్వేషన్ల ఊసే లేదు. 2014లో ఇచ్చిన ఒక్కొక్కరి ఖాతాల్లో 15లక్షలు జమ దగ్గర నుంచి మిగిలిన ఎన్నో హామీలను అటకెక్కించిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరవాల్సిన అవసరం ఉన్నది. 143 కోట్ల మంది జనాభా ప్రభుత్వం నుంచి ఆశించేది కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ, ఉపాధితో పాటు మౌలిక సదుపాయాలు.కానీ వాటి కల్పనలో ఆసాంతం నిర్లక్ష్యం కనిపిస్తున్నది. 2014లో చమురు బారెల్ ధర 109 డాలర్లు ఉన్నప్పుడు లీటర్ డీజిల్ రూ.62 , పెట్రోల్ రూ.72 ఉన్నది. గత పదేండ్లలో చమురు ధరలు 50 డాలర్లకు తగ్గినా లక్షల కోట్లు కేంద్రం ఖాతాలో వేసుకున్నదే కానీ వాటి ధరలు తగ్గించలేదు. ఫలితంగా నేడు 87 డాలర్లకు బారెల్ తగ్గితే లీటరు పెట్రోల్ ధర రూ.110, డీజిల్ రూ.100లకు పెరి గింది. అలాగే కిలో రూ. 27 ఉన్న బియ్యాన్ని రూ.58కు, రూ.83 ఉన్న కందిపప్పు రూ.173 కు, రూ.49 ఉన్న శనగపప్పు రూ.116, రూ.60 చింతపండును రూ.168లకు పెంచింది. అలాగే వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.415 నుం చి రూ.1150లకు పెంచి ఎన్నికలు సమీపిస్తున్నందున కంటి తుడుపు చర్యగా రూ.200 తగ్గించి ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నది.నిరుద్యోగం, ద్రవ్యోల్బ ణ పెరుగుదల రేటు గురించి చెప్పనవసరం లేదు. భారతదేశ అప్పులు 65 ఏండ్లలో రూ.58 లక్షల కోట్లు ఉంటే, మోదీ ప్రభుత్వం తొమ్మిదేండ్లలోనే 90 లక్షల కోట్లు అప్పు చేసి రికార్డు సృష్టించింది. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, అన్ని రంగాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నది. మోదీతోపాటు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన కేసీఆర్ దేశంలోని ఎన్నో రాష్ట్రాల కంటే సాగు విస్తీర్ణం పెంపుదలకు వీలుగా వ్యవసాయ రంగం రూపురేఖలు మార్చారు. దానికోసం తెలంగాణకు కేటాయించిన కృష్ణ, గోదావరి జలాల పూర్తి వినియోగానికి వీలుగా అసంపూర్తిగా ఉన్న వరద కాలువలు పూర్తి చేసి కొత్తగా కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టును నిర్మించారు. తాజాగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారు. సీఎం కేసీఆర్ రూ.1.59 లక్షల కోట్లు నీటి ప్రాజెక్టులపై ఖర్చు చేయగా మిషన్ కాకతీయ కింద రూ.కోట్లతో పురాతన గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించారు. ఇక్కడితో ఆగకుండా 3.10 లక్షలమంది రైతులకు సబ్సిడీ కింద రూ.2186 కోట్లు ఇచ్చి సూక్ష్మసేద్యా న్ని ప్రోత్సహించారు. నిరంతర విద్యుత్తు సరాఫరాతో వ్యవసాయ కనెక్షన్ల సంఖ్య 27.49 లక్షలకు చేరుకున్నది. రుణమాఫీ కింద రూ.17,351 కోట్లు, రైతుబంధు కింద 11 విడుతల్లో రూ.70,414 కోట్లు అందజేసి రైతాంగం హృదయాల్లో కేసీఆర్ గూడు కట్టుకున్నారు. 2014-15లో 68 లక్షల టన్నులు ఉన్న ధాన్యం ఉత్పత్తి 2023 నాటికి దాదాపు 2.70 కోట్ల టన్నులకు చేరుకున్నది. దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇండ్లు, పింఛన్ల పెంపుదల ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి.తెలంగాణలో 2014 నాటికి 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కేవలం 850 సీట్లు ఉండగా నేడు 21 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసి 10వేల సీట్ల దిశగా పయనిస్తున్నది. దేశం మొత్తం మీద కేవలం 157 ప్రభుత్వ వైద్య కళాశాలలను మాత్రమే మంజూరు చేసిన కేంద్రం తెలంగాణకు ఒక్క కళాశాల కూడా కేటాయించలేదు. అయినా వేల కోట్లు వెచ్చించి ప్రాథమిక దవాఖాన నుంచి సూపర్ స్పెషాలిటీ దాక ఎన్నో దవాఖానలను నిర్మిస్తున్న ఘనత కేసీఆర్‌ది. తెలంగాణలో ఐటీ పరిశ్రమ వృద్ధిరేటు గణనీయంగా పెరిగింది. నేడు ఐటీ ఉద్యోగుల సంఖ్య 9,05,715 కాగా 2026 నాటికి 10 లక్షలకు పైగా చేరుకొని రూ.3 లక్షల కోట్ల ఎగుమతులు సాధించే సానుకూల ధోరణి కనబడుతున్నది.కేంద్ర సహకారం లేకున్నా ఎన్నో ఆంక్షలను అధిగమించి కొత్త రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తెలంగాణను దేశానికి రోల్ మాడల్‌గా అభివృద్ధి చేస్తున్నారు. తెలంగాణలో ఇంత అభివృద్ధి, సంక్షేమం చేసినపుడు కేంద్రం ఎందుకు చేయలేదు? కేవలం మతోన్మాద రాజకీయాలు, ఊకదంపుడు ఉపన్యాసాలు, దేశంలోని మీడియాను గుప్పిట్లో పెట్టుకొని పబ్బం గడుపుతున్నది. చైనా మన అరుణాచలంలో భూభాగాన్ని ఆక్రమిస్తుందన్న వార్తలపై కూడా దీటుగా జవాబు చెప్పలేని స్థితిలో మోదీ ఉన్నారు. అలాంటపుడు జీ 20 సదస్సులు పెట్టుకొని ఏం ప్రయోజనం?రానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ధరల పెరుగుదల, నిరుద్యోగం, విదేశాంగ విధానం, వైద్య, విద్య రంగా ల్లో సామాన్యులకు మేలు జరిగే ప్రణాళికలపై చర్చ జరగాలి. అలాగే లక్షల కోట్ల మేర బ్యాంకులను దివాళాతీయిస్తూ దేశం విడిచి వెళ్తున్న బడాబాబులు నుంచి ఆ మొత్తాన్ని తిరిగి రాబట్టేలా చట్ట సవరణలు, పబ్లిక్ రంగ సంస్థల అమ్మకాల నిలుపుదలపై చర్చించాలి. అలాగే బీఆర్ఎస్ పార్టీ తరుపున ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు కేంద్రాన్ని లేఖ ద్వారా కోరిన విధంగా ఈ క్రింది అంశాలను కూడా ఎజెండాలో చేర్చవలసి ఉన్నది. పార్లమెంటు, అసెంబ్లీ చట్టసభల్లో 33 శాతం ఓబీసీలకు, 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు అమలయ్యేలా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసింది . రాజ్యాంగ రచన సమయంలో విస్మరించిన కొన్ని అంశాలను సరిదిద్దుకోవడానికి నాటి మేధావులు దార్శనికతతో అవకాశం కల్పించారు. దీన్ని వాడుకుని చట్టసభల్లో రిజర్వేషన్ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉన్నది.

# సనాతన జపంతో మోడీ ఎన్నికల పాచిక



రాజకీయ ప్రత్యర్థులను దెబ్బకొట్టడానికి ఇంకా చెప్పాలంటే వారి...దాడినీ ధాటినీ తట్టుకోవడానికి ఎప్పుడు ఏ అస్త్రం దొరికితే దాన్ని ప్రయోగించడం గొప్ప వ్యూహంగా, సమర్థనీయంగా చలామణి చేస్తుంటారు పాలక నేతలు, మీడియా పండితులు. ప్రతిపక్ష 'ఇండియా' వేదిక సనాతన ధర్మాన్ని నాశనం చేయడానికే పుట్టిందని ప్రధాని నరేంద్ర మోడీ మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచార సభలో ప్రకటించడం అలాంటిదే. ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలతో రగులుతున్న ఈ వివాదం నిజానికి మోడీ ప్రాథమిక విధానం, నినాదం. ఆ మాట చెప్పడానికి తిలక్‌నూ గాంధీజీని, వివేకానందుడినీ అడ్డు పెట్టుకోవడం అలాంటి కుటిల నీతి. ఎందుకంటే భారత రాజ్యాంగం 20వ శతాబ్దపు రాజకీయ పత్రమే తప్ప సనాతన ధర్మ పునరుల్లేఖన కాదు. అంతెందుకు మోడీజీ ప్రధానిగా దానిపైన లేదా భగవంతుడిపైన అంత:కరణపైన ప్రమాణం చేయగలరే గాని సనాతన ధర్మంపైన ప్రమాణం చేసే అవకాశమే లేదు. భగవాన్ అని ప్రమాణం చేసినప్పుడు కూడా ఫలానా సనాతన మత విశ్వాస దేవుడిపైన అనే పరిస్థితి అంతకన్నా లేదు. ఇదే ప్రమాణం ఒక సిక్కు లేదా ముస్లిం లేదా క్రైస్తవ ప్రజా ప్రతినిధి చేసినప్పుడు అది వారి దేవుడు లేదా విశ్వాసం ఏదైనా కావచ్చు. మరో హేతువాది చేస్తే అంత:కరణతో ఆగొచ్చు...రాజ్యాంగమే సనాతన ధర్మాన్ని కొలబద్దగా ఎప్పుడో తిరస్కరించింది. కనుక ఇందుకు పెద్ద చర్చ అవసరమే లేదు. ఇక గాంధీజీ, తిలక్ వంటి వారి వారసత్వాన్ని మోడీ ప్రస్తావించడం విషయానికి వద్దాం. నిజంగా తిలక్ మహాశయుడు గాంధీకన్నా ముందు తరంలో అగ్ర నాయకుడు. కార్మికులను సంఘటిత పరిచినవాడు. ఆయన అరెస్టుపై ముంబయి కార్మికులు సమ్మె చేస్తే లెనిన్ అభినందిస్తూ లేఖ రాశారు. తిలక్ గణేష్ ఉత్సవాలను దేశభక్తి రగిలించేందుకు ఉపయోగించారు. భగవద్గీత తనను కర్తవ్య నిర్దేశానికి ఉత్తేజపరిచిందని చెప్పారు. కానీ ఎక్కడా ఆయన కులాల వివక్షను సమర్థించిన దాఖలాలు లేవు. గాంధీజీ కూడా అంతే. పైగా గీతలో చెప్పిన చాతుర్వర్ణ సిద్ధాంతానికి తనవైన భాష్యాలు చెప్పిన గాంధీ అస్పృశ్యత నివారణ ఉద్యమం ఒక గొప్ప లక్ష్యంగా చేసుకున్నారు. సంస్కరణ కోణంలో మరుగుదొడ్లు శుభ్రపరిచే కార్యక్రమం, దళితుల ఆలయ ప్రవేశం వంటివి స్వాతంత్ర్య పోరాటంలో కీలక భాగంగా చేశారు. సనాతన ధర్మం మార్చాల్సిన అవసరాన్ని ఆ విధంగా ఆచరణలో చూపించారు. భగత్ సింగ్ ప్రవేశానికి ముందు జాతీయ సాయుధ విప్లవవాదులు దుర్గాదేవి ముందు ప్రతిజ్ఞ చేస్తుంటే దాన్ని మార్పించారు. ఇందులో ఎక్కడా సనాతన ధర్మ ప్రసక్తి లేదు. స్వాతంత్ర్య పోరాటం తప్ప.

### మోడీ మాట, మార్గం వేరే

స్వాతంత్ర్యం కన్నా సనాతన ధర్మం ఇంకా చెప్పాలంటే హిందూ మతమే ముఖ్యమని భావించడం వల్లనే మోడీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ అందుకు దూరంగా వుండిపోయింది. అందుకు ముస్లిం వ్యతిరేకత ప్రధాన ప్రేరణ అయ్యింది. మత సామరస్యం బోధించిన గాంధీజీ ఆగర్భశత్రువు అయ్యాడు. రామ నామ స్మరణ చేస్తూనే గాంధీజీ ప్రాణం విడిచాడని చెబుతున్న మోడీ ఆయన మామూలుగా చనిపోయినట్టు మాట్లాడటం దారుణం. జీవితమంతా రామ నామ స్మరణ చేసిన గాంధీజీ గాడ్సేకు సనాతన వ్యతిరేకిగా కనిపించాడు గనక దారుణంగా కాల్చి చంపేశాడు. అది కూడా ప్రార్థన చేయబోతుండగా ఆపేసి మరీ చంపాడు. మోడీ అన్నట్టు గాంధీజీ రామ నామ స్మరణతో ఆగలేదు మరి! ఈశ్వర్ అల్లా తేరేనాం అన్నారే? సనాతన ధర్మం కన్నా పరమత ద్వేషం ఎక్కువైన గాడ్సే ఎలా సహిస్తాడు? ఆయన గురువైన వినాయక్ దామోదర్ సావర్కార్ చెప్పింది అదే కదా. గాంధీ, తిలక్ పేర్లు చెప్పే ప్రధాని ఈ వాస్తవాన్ని ఎందుకు మరుగు పరుస్తున్నారు? బిజెపి నేతలు గాడ్సే దేశభక్తి గురించి మాట్లాడటం, సావర్కార్‌ను పోటీ జాతిపితగా పార్లమెంటులో ప్రతిష్టించడం యాదృచ్ఛికం కాదు. ఈ మత ద్వేష భావన కారణంగానే ఉదయనిధి స్టాలిన్ మాటలు అంత తప్పుగా కనిపిస్తున్నాయి. నిజానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత భోజన పథకం సందర్భంగా ఒక దేవాలయంలో వివక్ష చూపి దళితులను రానివ్వకుండా దౌర్జన్యం చేసిన ఘటన ఆయనతో ఈ మాటలనిపించిందని తెలుస్తున్నది. సనాతనం అంటే ఏమిటి? పురాతనం అంటే పాతది. అధునాతనం అంటే ఆధునికమైంది. కానీ సనాతనం అంటే శాశ్వతత్వం లాంటిది. అనాది. కృష్ణుణ్ణి పూజించేప్పుడు సనాతన అనే పదం కూడా వాడతారు. ఆ కృష్ణుడు కూడా ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే అన్నాడే గాని శాశ్వతంగా ఒకటే వుంటుందనలేదు. అసలు ధర్మమంటే దుష్ట శిక్షణ శిష్ట రక్షణ అని కర్తవ్యం చెప్పాడు. దుష్టం అంటే మనుషులే కాదు పద్ధతులు కూడా. ఆచారాలను పాటించాలనుకున్నా అన్నీ మంచివి కావు, దుర్మార్గమైనవి వున్నాయి గనకే దురాచారాలు అన్నారు. వివేకానందుడిని ఉటంకించిన మోడీజీ ఆయన మతాల మధ్య, శాఖల మధ్య విభేదాలు ఎంత విపత్కరమో చెప్పిన మాట దాటేశారు. విజ్ఞాన శాస్త్రంలో పురోగమనం లేకుండా మూఢాచారాల వెంట పరుగుపెట్టడం వల్లనే భారత దేశం వెనకబడిపోయిందని వివేకానందుడే చెప్పాడు. ఆయనను కూడా తమ జాబితాలో చేర్చుకుంది సంఘ పరివార్. మోడీ అదే చేశారు. ఇక మరీ కీలకమైంది రాజారామ్మోహనరారు వారసత్వం. దేశ పునరుజ్జీవనంలో అగ్రగణ్యుడైన రామ్మోహన్‌రారు సతీసహగమనంపై వీరోచితంగా పోరాడారే గాని సనాతనమని నెత్తిన పెట్టుకోలేదు. దురాచారాల దురాగతాలను తుదముట్టించిన అగ్ని తరంగం వీరేశలింగం కూడా అదే కోవ. ఈ స్వాతంత్ర్య యోధులు, సంస్కర్తల్లో ఎవరైనా సనాతనం గొప్పదని చెప్పారేమో దేశాధినేత చూపించగలరా? 'భూతకాలపు సరీసృపాలను/ పాత రాతియుగంలో పాతెరు' అన్న శ్రీశ్రీ మాటలను నిజం చేశారు. 'రాజు కట్టిన కోట/ రాణి మెట్టిన తోట/ జిల్లేడు మొలచిందిలే/ పల్లేరు పాకిందిలే అని తొలినాటి సంద్రాలు ఇంకిపోతున్న వైనాన్ని చూపారు (పురిపండా అప్పలస్వామి). వెనకబడితే వెనకేనోరు అని గురజాడ అంటే పదండి ముందుకు అని శ్రీశ్రీ పరిగెత్తించారు. ఆ సంస్కర్తల ఆశయ రంగం నీవు నిలిచిన ఈ సంఘం అని నారాయణరెడ్డి వంటి వారు గానం చేశారు. కాలం ముందుకు పోతుంది తప్ప వెనక్కు నడవదు. అనుమానమున్నవారు గడియారం చూసి తెలుసుకోవచ్చు. ముల్లు వెనక్కుపోదని. ఏ సనాతనం అంటూ శాశ్వతంగా వుండదని. అర నిమిషం గడిచేసరికదే నాకు గత శతాబ్ది అన్న మహాకవి మాట అదే. సంఘ సంస్కరణ, స్వాతంత్ర్య పోరాటం, సామ్యవాద భావజాలం త్రివేణీ సంగమంలా ఈ దేశ ప్రజల వికాసానికి, విముక్తికి బాట వేశాయి. చంద్ర మండలానికి పయనించే స్వావలంబనకు కారణమైనాయి. ఇస్రో శాస్త్రజ్ఞులు వ్యక్తిగతంగా పూజలు చేసి వుండొచ్చు గానీ అది కూడా విమర్శలను ఎదుర్కొన్నది.

### చందమామపై చంద్రమౌళి పేరా?

బిజెపి ఎం.పి జివిఎల్ నరసింహారావు నాతో ఒక టీవీ చర్చలో ఇస్రో వారి పూజలు సనాతనానికి ఆమోదంలాగా చెప్పడం హాస్యాస్పదమైంది. అయితే అందులోనూ మరో విడ్డూరముంది. పురాణాలు ఈశ్వరుణ్ణి చంద్రమౌళిగా అభివర్ణించాయి. అంటే తలలో చంద్రుడు కలిగివున్నాడని. కాని మానవ చోదిత నౌక ద్వారా చంద్రునిపై దిగిన స్థలానికి మోడీ శివస్థల్ అని నామకరణం చేస్తారు. తలపై వున్నవారు కాలూనడం ఏమిటి? ఇక్కడేమన్నా పొంతన కనిపిస్తుందా? పైగా దేశం తరపున జరిపిన ప్రయోగాన్ని ఒక మతానికే ఎలా ఆపాదిస్తారు? సనాతనం పేరిట హిందూత్వను రుద్దడమే ఇక్కడ రహస్యం. ఇంతకూ సనాతనంలో హిందూత్వ పదం వుందా? సావర్కార్ దాన్ని 1927లో కదా కనిపెట్టింది? అంతా రాజకీయమే. కసిరి బుసకొట్టునాతని గాలి సోక నాల్గు పడగల హైందవ నాగరాజు అని గుర్రం జాషువా హెచ్చరించింది అందుకే, మోడీ సనాతన సమర్థనలో రాజకీయ కోణమదే. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో దాన్ని రెచ్చగొట్టడానికే ఆయన ఈ ప్రస్తావన తెచ్చారు. దాన్ని సూటిగా తిరస్కరించకపోతే దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక చైతన్యం, మానవత్వం వంటి మాటలకు అర్థమే వుండదు. రాజకీయంగా నేరుగా ఖండించడం నష్టమని సన్నాయి నొక్కులు నొక్కే కొందరు మేధావులు దాన్ని నిరాఘాటంగా అనుమతిస్తే మరెంత ఘోరం జరుగుతుందో తెలుసుకోలేని అజ్ఞానంలో చిక్కుకున్నారు. పరోక్షంగా ఆ శక్తులకు పావులవుతున్నారు మోడీని విశ్వగురువుగా కీర్తించేవారు. ఈ మధ్యనే ఆయన కోరి నెత్తునెత్తుకున్న అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కూడా ఢిల్లీలో జరిపిన చర్చలలోనూ మానవ హక్కుల రక్షణ గురించి క్లాసు పీకారంటే ఏమనాలి? ఇక్కడ చెప్పకుండా వియత్నాంలో మీడియాకు ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఇక అమెరికాలో మత స్వాతంత్ర్యా పరిరక్షణకు పనిచేసే యుఎస్‌సిఆర్ఎఫ్ నేరుగానే భారత దేశంలో మత స్వాతంత్ర్యంపై దాడులు జరుగుతున్న పరిస్థితిని ప్రస్తావించింది. మత మార్పిడి నిషేధం, గోరక్షణపై వివాదాలు-బిల్లులు, పౌరసత్వ చట్టాల సవరణలు, స్వచ్ఛంద సంస్థలపై మత కోణంలో ఆంక్షలు వంటి పరిణామాలను కూడా పేర్కొంది. ఇండియాను ప్రత్యేకంగా ఆందోళన కలిగించే దేశంగా పరిగణించాలని సిఫార్సు చేసింది. ఇతరులకు నీతులు చెప్పే హక్కు అమెరికాకు వుందా అనే ప్రశ్న ఒకటైతే పెరిగిన విద్వేష వాతావరణం అంతర్జాతీయంగా భారతీయులకు తలవంపులు తెస్తున్న వాస్తవం మాత్రం నిజం. వివేకానందుడు అమెరికా లోని చికాగో లోనే దేశ ఔన్నత్యాన్ని చాటి సామరస్య సందేశం ఇస్తే మోడీ సర్కారు ఆ వారసత్వాన్ని తలకిందులు చేస్తున్నది. దీన్ని విమర్శనాత్మకంగా ఎదుర్కొనకుండా సన్నాయి నొక్కులు నొక్కితే ప్రయోజనం వుండదు. ఆలోచనాపరులందరికీ శాంతి ప్రియతములందరికీ ఇది నేటి కర్తవ్యం.

### 'ఇండియా'కు ఆపాదించనేల?

చివరగా రాజకీయ కోణానికి వస్తే డిఎంకె నాయకుడైన జూనియర్ స్టాలిన్ మాట్లాడిన దానిపై 'ఇండియా' వేదికలో రకరకాల అభిప్రాయాలు వుండొచ్చు. ఉదాహరణకు 'ఆప్' ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తాను సనాతనవాదాన్ని సమర్థిస్తానన్నారు. ఈ విషయంలో ఏ విధమైన తీర్మానాన్ని గాని విధానాన్ని గాని ప్రకటించింది లేదు. మత సామరస్యం కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేయడం అన్న ఆశయం లౌకిక పక్షాలను ఈ వేదికపై కలిపింది, సమస్యలు పరిష్కరించుకుంటూ సీట్ల పంపిణీపై అవగాహన దిశలో నడుపుతున్నది. ఈ కార్యాచరణే బిజెపిని, మోడీని భయపెడుతున్నది. అందుకే ప్రతిపక్షాలు సనాతన ధర్మాన్ని నాశనం చేయాలనుకుంటున్నాయని అస్త్రం వదిలి మతపరమైన విభేదాలు పెంచాలనుకుంటున్నారు. మత చాందసాలను, మూఢనమ్మకాలను, దురాచారాలను తప్పక వ్యతిరేకించాల్సిందే గాని ఏ మత విశ్వాసంపైన 'ఇండియా' దాడి చేసే ప్రసక్తి వుండదు. ప్రతిపక్షాల, లౌకిక పార్టీల సమైక్య కదలికతో హడలెత్తిన మోడీ వేసిన పాచిక ఇది. దురాచారాలతో పాటు ఈ దుస్తంత్రాలను కూడా తిప్పికొట్టి ముందుకు సాగడమే ఇందుకు సరైన సమాధానమవుతుంది. ఈ దేశ ప్రజలూ ఆ విధమైన సమాధానమే ఇస్తారని ఆశించాలి.

## దుర్గామాత నూతన మండపారాధన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



వేమనపల్లి సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: బెల్లంపల్లి నియోజకవర్గం //– బెల్లంపల్లి పట్టణం, 11వ వార్డ్ లో శ్రీ విఘ్నేశ్వర దుర్గామాత నూతన మండపారాధన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లిగౌరవ బెల్లంపల్లి శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య.

## ఉట్నూర్ శాంతినగర్ లో ఆరోగ్య శ్రీ డిజిటల్ హెల్త్ కార్డు ఉచిత ఇ -కెవైసి నమోదు శిబిరం





ఉట్నూరు : ఈరోజు ప్రతినిధి: ఆరోగ్యశ్రీ లబ్దిదారులకు కార్డులను పంపిణీ చేసేందుకు ఇ –కెవైసి ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నూతన కార్డులను అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం మేరకు ఉట్నూర్ శాంతినగర్ లో ఆరోగ్య శ్రీ డిజిటల్ హెల్త్ కార్డు ఉచిత ఇ –కెవైసి నమోదు శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని,ఆరోగ్య శ్రీ సేవల పరిమితిని రెండు లక్షల నుండి ఐదు లక్షల పెంపు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని బి ఆర్ ఎస్ మండల ఎస్సి సెల్ అధ్యక్షులు కొల్లూరి స్వామిలి హర్షం వ్యక్తం చేసారు,శిబిరాలు నిర్వహిస్తూ, ఉచితంగా సేవలను అందిస్తున్న బి ఆర్ ఎస్ యువ నాయకుడు జూగ్నక్ గంగాధర్ని పలువురు అభినందించారు, ఈ కార్యక్రమం లో లికాంబ్లె ప్రజ్ఞశీల్,తల్వారే రాజు,జాడి వెంకటేష్, సుశీల్,మానే సంజీవ్, పోడేటి వినోద్లి తదితరులు పాల్గొన్నారు..

## మతాలకు అతీతంగా అన్నదానం



లక్షెట్టిపేట :ఈరోజు ప్రతినిధి: సెప్టెంబర్ 19 పట్టణంలోని మహాలక్ష్మి వాడలో స్థానిక మహాలక్ష్మి వాడ వినాయక భక్త మండలి వద్దమతాలకు అతీతంగా మంగళవారం అదే పట్టణానికి చెందిన ముజ్జు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ముజ్జు మాట్లాడుతూ.. అన్నదానం అన్ని దానాల కంటే గొప్పదన్నారు. కాలనీవాసులు ముజ్జు మతాలకు అతీతంగా ప్రజలకు చేస్తున్న సేవలను చూసి హర్షం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బొంగోనీ రవి, కొల్లూరి నితిన్, కంకణాల సచిన్, మోత్కూరి నారాయణ గౌడ్, మోత్కూరి సంజీవ్, పెరగాని వంశీ, వినోద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డీజేలను వాడినట్లైతే కఠిన చర్యలు తప్పవు: ఎస్ఐ లక్ష్మణ్

లక్షెట్టిపేట: సెప్టెంబర్ 19ఈరోజు ప్రతినిధి: వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలను వాడినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని లక్షెట్టిపేట ఎస్సై ఎస్. లక్ష్మన్ డీజే నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం లక్షెట్టిపేట మండలలోని డీజే నిర్వాహకులను పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ..... పోలీస్ శాఖ నిబంధనల మేరకు వినాయక చవితి ఉత్సవాలలో డీజేలను నిషేధించడం జరిగిందని నిర్వాహకులకు ఎస్సై వివరించారు. ఎక్కడైనా డీజేలు నిర్వహించినట్లు కనిపించినట్లయితే కఠిన చర్యలతో పాటు డిజెలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ముందస్తు చర్యలలో భాగంగా 14మంది డిజె నిర్వాహకులను తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేసామని ఎస్ఐ లక్ష్మణ్ తెలియజేశారు.

# మహిళా బిల్లుతో మారే బీఆర్ఎస్ సీట్లు ..!

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ లో 119స్థానాలు ఉన్నాయి. వాటి లో 33శాతం సీట్లు అంటే సుమారు 40స్థానాల్లో మహిళలు ప్రాతినిధ్యం వహించాలి. తెలంగాణ అసెంబ్లీలో తాజా లెక్కల ప్రకారం ... 63 స్థానాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మహిళలను రిజర్వ్ చేసేందుకు దీన్నే ప్రాతిపదికగా తీసుకుంటే సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్వర్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు తదితరులు తమ స్థానాలను మార్చుకోవలసి ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలలో మెజార్టీ స్థానాల్లో మహిళల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ స్థానాలను మహిళలకు కేటాయించాల్సి వస్తే, ప్రధాన పార్టీల్లోని సీనియర్లు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వస్తుంది.

పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలు

1. ఆదిలాబాద్ – 114016 (జోగు రామన్న)
2. బోథ్(ఎస్టీ) – 102576 (అనిల్ జాదవ్)
3. ఖానాపూర్(ఎస్టీ) – 104537 (భూక్య జాన్సన్ రాథోడ్ నాయక్)
4. నిర్మల్ – 122696 (ఇంద్రకరణ్ రెడ్డి)
5. ముధోల్ – 119092 (విట్టల్ రెడ్డి)
6. ఆర్మూర్ – 105657 (ఆశన్న గారి జీవన్ రెడ్డి)
7. బోధన్ – 106222 (మహ్మద్ షకిల్ అహ్మద్)
8. బాన్సువాడ – 94941 (పోచారం శ్రీనివాస రెడ్డి)
9. నిజామాబాద్ అర్బన్ – 138615(బిగాల గణేశ్ గుప్త)
10. నిజామాబాద్ రూరల్ – 127602 (బాజిరెడ్డి గోవర్ధన్)
11. బాల్కొండ – 111424 (వేముల ప్రశాంత్ రెడ్డి)
12. జుక్కల్ (ఎస్సీ) – 95512 (హన్మంత్ షిండే)
13. ఎల్లారెడ్డి – 107603(జాజుల సురేందర్)
14. కామారెడ్డి – 117783(కేసీఆర్)
15. కోరట్ల – 116536 (డా. సంజయ్ కల్వకుంట్ల)
16. జగిత్యాల – 109853 (డా. ఎం. సంజయ్ కుమార్)
17. ధర్మపురి(ఎస్సీ)– 107068 (కొప్పుల ఈశ్వర్)
18. మంథని – 110840 (పుట్టా మధు)
19. పెద్దపల్లి – 120120 (దాసరి మనోహర్ రెడ్డి)
20. చొప్పదండి(ఎస్సీ)– 116006 (సుంకే రవి శంకర్)
21. మానకొండూర్(ఎస్సీ)– 107087 (రసమయి బాలకిషన్)
22. హుజూరాబాద్ – 119632 (పాడి కౌశిక్ రెడ్డి)
23. వేములవాడ – 107839 (చల్మెడ లక్ష్మీ నరసింహారావు)
24. సిరిసిల్ల – 116066 (కేటీఆర్)
25. ఆంధోల్(ఎస్సీ) – 114077 (చంటి క్రాంతి కిరణ్)
26. సంగారెడ్డి – 107750 (చింతా ప్రభాకర్)
27. మెదక్ – 105075 (ఎం. పద్మా దేవేందర్ రెడ్డి)
28. నర్సాపూర్ – 104712 (పెండింగ్)
29. హుస్నాబాద్ –114218 (వొడిదెల సతీశ్ కుమార్)
30. సిద్ధిపేట – 109938 (హరీశ్ రావు)
31. దుబ్బాక – 95375 (కొత్త ప్రభాకర్ రెడ్డి)
32. గజ్వేల్ – 126814 (కేసీఆర్)
33. తాండూర్ – 111529 (పైలెట్ రోహిత్ రెడ్డి)
34. కొండంగల్ – 108157 (పట్నం నరేందర్ రెడ్డి)
35. దేవరకొండ – 107951 (రవీంద్ర కుమార్ రమావత్)
36. గద్వాల – 118447 (బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి)
37. అలంపూర్(ఎస్సీ)– 111439 (వీఎం అబ్రహం)
38. నాగార్జున సాగర్ – 109992 (నోముల భగత్)
39. మిర్యాలగూడ – 107265 (నల్లమోతు భాస్కర్ రావు)
40. నల్లగొండ – 114211 (కంచర్ల భూపాల్ రెడ్డి)
41. హుజూర్ నగర్ – 117299 (సైదిరెడ్డి)
42. కోదాడ – 114706 (బొల్లం మల్లయ్య యాదవ్)
43. సూర్యపేట – 113049 (జగదీశ్ రెడ్డి)
44. జనగామ – 110512 (పెండింగ్)
45. ఘన్‌పూర్ స్టేషన్(ఎస్సీ)– 117439 (కడియం శ్రీహరి)
46. మహబూబాబాద్(ఎస్టీ) – 119343 (బానోత్ శంకర్ నాయక్)
47. నర్సంపేట – 110271 (పెద్ది సుదర్శన్ రెడ్డి)
48. వరంగల్ ఈస్ట్ – 120903 (నన్నపునేని నరేందర్)
49. వర్ధన్నపేట(ఎస్సీ)– 125541 ఆరూరి నరేశ్
50. పరకాల – 105788 (చల్లా ధర్మారెడ్డి)
51. వరంగల్ వెస్ట్ – 134053 (దాస్యం వినయ్ భాస్కర్)
52. పినపాక(ఎస్టీ) – 94012 (రేగా కాంతారావు)
53. ఇల్లందు(ఎస్టీ) – 105638 (బానోత్ హరిప్రియ నాయక్)
54. కొత్తగూడెం – 117338 (వనమా వెంకటేశ్వర రావు)
55. అశ్వారావుపేట(ఎస్టీ) – 76305 (మెచ్చా నాగేశ్వర్ రావు)
56. భద్రాచలం(ఎస్టీ) – 74121(డా. తెల్లం వెంకట్రావు)
57. ఖమ్మం – 159527 (పువ్వాడ అజయ్ కుమార్)
58. పాలేరు – 114636 (కందాల ఉపేందర్ రెడ్డి)
59. మధిర(ఎస్సీ) – 107698 (లింగాల కమల్ రాజు)
60. వైరా(ఎస్టీ) –94024 (బానోత్ మదన్ లాల్)
61. సత్తుపల్లి(ఎస్సీ)– 115405 (సండ్ర వెంకట వీరయ్య)
62. నారాయణపేట – 107139 (ఎస్.రాజేందర్ రెడ్డి)63. మక్తల్ – 111870 (చిట్టెం రామ్మోహన్ రెడ్డి)

## బహిరంగ సభ విజయవంతానికి కృషి చేసిన ప్రజలకు కృతజ్ఞతలు



మంచిర్యాల జిల్లా ఈరోజు ప్రతినిధి: సెప్టెంబర్ 19: రాష్ట్ర రాజధాని హైదరాబాదులో జరిగిన బహిరంగ సభకు చెన్నూరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి సభ విజయవంతానికి కృషి చేయడం ఆనందంగా వుంది అని, సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు అని చెన్నూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేష్ బాబు అన్నారు. సోమవారం మందమర్రి లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్క సుమన్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ కి, పార్టీలో ఆదరణ పొందుతున్న తనని చూసి ఓర్వ



లేక తన స్వంత డబ్బా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ఓటమి భయాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. గౌరవప్రదమైన ప్రభుత్వ (సింగరేణి) ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చింది అమ్ముడుపోవడానికి కాదు అని, నియోజకవర్గం నుంచి అరాచక శక్తిని, బానిసత్వాన్ని తరిమికొట్టడానికి వచ్చాను అని హెచ్చరించారు. ఈ ప్రాంత ప్రజలను బానిసలుగా చూస్తూ,అహంకార వైఖరితో పాలన సాగిస్తున్న బాల్క సుమన్ కు చెన్నూరు ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పే విధంగా ప్రజలను చైతన్యం చేసి సుమన్ ను నియోజకవర్గం నుండి తరిమికొట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుంది అని తెలిపారు. తనతో ఇతర రాజకీయ పార్టీ నాయకులు, కార్మిక సంఘం నాయకులు మాట్లాడితే పార్టీ మార్పుకు చర్చలు జరుగుతున్నాయని ప్రచారం చేయడం లోనే సుమన్ భయం కనిపిస్తుంది అని, అసత్య ఆరోపణలు, ప్రచారం తో తనలోని భయాన్ని దాచి బయటకు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాడు అని అన్నారు. ఇప్పటికైనా నీతి నిజాయితీ తో మాట్లాడాలి అని, అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు గోపతి రాజయ్య, మందమర్రి మండల ప్రెసిడెంట్ కదరి జీవన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాసరెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు గోపతి బానెష్, intuc vice ప్రెసిడెంట్ చంద్రగిరి ఎల్లయ్య, సీనియర్ నాయకులు లింగన్న, రవీందర్, లాజర్, యూత్ కాంగ్రెస్ నాయకులు పొన్నం హరీష్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉద్యోగులకు కరువైన ప్రభుత్వ ఆదరణ... వారి డిమాండ్స్ న్యాయబద్ధమైనవే: నక్క విజయ్ కుమార్



జగిత్యాల ఈరోజు ప్రతినిధి: జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ ధర్మపురి ఇన్చార్జి నక్క విజయ్ కుమార్ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది రోజుల నుంచి అంగన్వాడి ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని ఎద్దేవా చేశారు. దేశంలో ఉన్న బడుగు బలహీన, పేద వర్గాల చిన్నపిల్లలు మరియు గర్భిణీ స్త్రీలు పౌష్టికాహర లోపంతో చనిపోతున్నారని గ్రహించి ఆనాడు మన రాజ్యాంగ వేత్తలు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ఆధారంగా అంగన్వాడి కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. దరిమిల నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే ఆడపడుచులైన అంగన్వాడీ టీచర్లను, ఆయాలను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూడడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఖద్దరు చొక్కా నలగని మీరేమో లక్షల జీతాలు తీసుకుంటారు కానీ ప్రభుత్వం తలపెట్టే ప్రతి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంగన్వాడీ ఉద్యోగులను మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. వారేమి గొంతెమ్మ కోరికలు కోరడం లేదని వారి డిమాండ్స్ న్యాయబద్ధమైనవని అన్నారు. పౌష్టికాహారము అందించడానికి ఏర్పడ్డ అంగన్వాడీలను అన్ని రంగాలలో ప్రభుత్వము ఉపయోగించుకుంటూ వారి కష్టానికి తగ్గ జీతం మాత్రం ఇవ్వడానికి ఎందుకు మనసు రావడంలేదని ప్రశ్నించారు. మీ పార్టీ ఆఫీసులు కట్టుకోవడానికి, ఆశీర్వాద సభలు నిర్వహించుకోవడానికి లక్షలాది రూపాయలు ఉన్నాయి కానీ అంగన్వాడీలకు జీతాలు పెంచడానికి డబ్బులు లేవా అని ఎద్దేవ చేశారు. ఇకనైనా వారిని పర్మినెంట్ చేసి, రూపాయలు 26,000 కనీస వేతనం, 60 సంవత్సరాలకే రిటైర్మెంట్, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా ఇచ్చి, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యూటీని ప్రభుత్వం తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అంగన్వాడీ ఉద్యోగుల డిమాండ్స్ ను నెరవేర్చకపోతే బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అంగన్వాడీలతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కరోనా టైములో కొన్ని సంవత్సరాలు సెంటర్లు బంద్ ఉన్న ధాన్యము పాడు కాలేదు గాని తొమ్మిది రోజులకే ధాన్యము పాడైతుందని అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి గుండాలలాగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. మీరు పనిచేయకపోతే ఏమీ కాదు, మేము వేరే వారిని పెట్టి నడిపిస్తామని బెదిరించడం సబబు కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అంగన్వాడీల పోరాటం అజరామరమని అలాంటి అంగన్వాడి ఉద్యోగులను పట్టించుకోకపోవడం సరైనది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ మండల అధ్యక్షులు బచ్చల స్వామి, గొల్లపల్లి మండల అధ్యక్షులు కల్లెపెల్లి తిరుపతి, నాయకులు చెన్న శ్రీనివాస్, బచ్చల శైలెందర్, సంగెపు శేఖర్, సోషల్ మీడియా ఇంచార్జ్ బచ్చల తదితరులు పాల్గొన్నారు.

## డీజే నిర్వహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి




దస్తురాబాద్,సెప్టెంబర్ 19ఈరోజు ప్రతినిధి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో డీజేను నిషేదించడం జరిగిందని ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో డీజే నిషేధంలో భాగంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గొడిసేర్యాల,మున్యాల గ్రామాలకు చెందిన ఇద్దరు డీజే నిర్వహకులను తహసీల్దార్ ఎండీ జాకీర్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భాంగా తహసీల్దార్, ఎస్ఐ లు మాట్లాడుతూ....డీజే నిర్వహకులు అధికారులకు సహకరించాలని కోరారు.మండలంలోని ఎవరైన అనుమతులు లేకుండా డీజేను వినియోగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఐకె ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల పంపిణీ



దిల్వార్పూర్ ఈరోజు ప్రతినిధి: మండల కేంద్రంలో ఉదయం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గారి " ఐకె ఫౌండేషన్" ఆధ్వర్యంలో 400 మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు పంపిణీ చేయడం జరిగింది. భక్తులు పండగ పూట వినాయక విగ్రహ పంపిణీకి గాను చాలా ఆనందించారు. ఈ కార్యక్రమం యందు వినాయక విగ్రహాల పంపిణీలో గ్రామంలోని పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొనడం జరిగింది.

## అంగన్వాడి కార్యకర్తల రిలే నిరాహార దీక్ష



దిల్వార్పూర్ ఈరోజు ప్రతినిధి: మండల కేంద్రంలోనీ 6రెవెన్యూ ఆఫీస్ కి ముందు చేపడుతున్న అంగన్వాడీ కార్యకర్తల రిలే నిరాహార దీక్ష ఈరోజుతో 8 రోజులకి చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ తాము గ్రామ మండల స్థాయిలో పగలు రాత్రి అనకుండా ప్రజల అవసరాలు తీర్చడంలో మమేకమైతు గ్రామస్థాయిలోని ప్రజల అవసరాలని తీర్చడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నప్పటికీ తమకు తగిన గుర్తింపు లేదని తమ యొక్క బాధని విల్లవించారు.

## చంద్రబాబు అరెస్టుకు నేటి నుండి

# టిడిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



మధిర రూరల్ సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలో చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా తెలుగుదేశం శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరసనలకు అన్ని వర్గాలవారు సంఘీభావం ప్రకటిస్తున్నారని, బిఆర్ యస్ పార్టీ మాత్రం ఒక వైపు రాజకీయాలకు అతీతంగా సంఘీభావంతెలుపుతున్నామని చెప్పి, మరోవైపు విప్రో సర్కిల్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపు తున్న ఐటి ఉద్యోగులపై కేసులు పెడుతున్నారని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం పార్లమెంటరీ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ రామనాథం ఆరోపించారు. చంద్రబాబు అక్రమ నిర్భంధానికి నిరసనగా, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగే రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని దీక్ష శిబిరాలు నాయకులకు పూలమాల వేసి దీక్షను డా.రామనాథం ప్రారంభించారు ఈ సందర్భంగా వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.చంద్రబాబు త్వరలోనే నిర్దోషిగా బయటకు వస్తారని, అంతవరకు ప్రజాస్వామ్య పద్ధతిలో టిడిపి నిరసనలు కొనసాగుతాయని తెలిపారు అదేవిధంగాఆర్థిక నేరగాడు జగన్ రెడ్డి పై ఆధారాలతో సహా కేసులు పెట్టి, 2012 లో చంచల్ గూడ జైలుకు పంపితే, తల్లి, భార్య, చెల్లి తప్ప, ఉమ్మడి రాష్ట్రం లోని 23 జిల్లాల్లో ఏ ఒక్కరు స్పందించలేదని, ఈరోజు నిరాధార కేసుపెట్టి బాబుఅరెస్ట్ చేస్తే తెలుగు రాష్ట్రాలలో,విదేశాల్లో వున్న ప్రజలు, మహిళలు, ఉద్యోగులు యిలా అన్ని వర్గాలవారి నిరసన ఏవిధంగా తెలుపుతున్నారో చూస్తున్నామని, దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు స్పష్టంగా అవగతమైందని తెలిపారు అనంతరం లేని ఆరోపణలు సృష్టించి, అన్యాయంగా చంద్రబాబు ని అరెస్ట్ చేసారని, అతిత్వరలో కడిగిన ముత్యంలాగా బయటకు వస్తారని పేర్కొన్నారు. ప్రజల నుండి చంద్రబాబు పై అక్రమ కేసుపెట్టి అరెస్ట్ చేసిన తీరుకు తెలంగాణ వ్యాపితంగా వెల్లువెత్తిన ప్రజా నిరసనే ఆయనకు శ్రీరామ రక్షని, అభివృద్ధి ప్రదాతను అక్రమంగా నిర్భంధించినందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని తెలిపారు టిడిపి నేటి రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ పలువురు ప్రముఖు లు. ఈ కార్యక్రమంలో చేరూరి శేఖర్ బాబు, వేమూరి సునీల్, మేడేపల్లి రాణి, బోనకల్ పార్టీ అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, కార్యదర్శి మరీదు బరకయ్య, చెరుకూరి కృష్ణారావు, నాయకులు చావా శివాజి, పాశం రామనాథం, తుళ్లూరి శ్రీనివాసరావు, వట్టికొండా రామ్మోహన్ రావు, మాదల నరసింహారావు, వనమా వెంకటేశ్వరరావు మల్లాది హనుమంతరావు, సీనియర్ టిడిపి నాయకులు గద్దల ప్రకాశరావు, నాయకులు గద్దం రమేష్, మేడా వెంకటేశ్వరరావు, చావా శ్రీనివాసరావు పాల్గొన్నారు

## సన్నబియ్యం కాదు పురుగులు బియ్యం... ఎస్ఎఫ్ఐ



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల తరంగ్ మాట్లాడుతూ మంచాల బాలికల హాస్టల్లో 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు అందులో 6 మంది వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ లో 2 మంది విద్యార్థులు గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే పురుగుల బియ్యం పెట్టి విద్యార్థులను అస్వస్థతకు గురి చేశారని ఆయన అన్నారు. బంగారు తెలంగాణలో విధ్యార్థులకు సన్నబియ్యం పౌష్టికాహారం అందిస్తున్నమని అన్నారు. కానీ విధ్యార్థులు కడుపునిండా అన్నం తిన్న రోజులు లేవు సలిసలనా అన్నం తిన్న ఫుడ్ పాయిజన్ అయ్యి అనారోగ్యంతో బాధపడుతున్నారు అని ఆయన ప్రభుత్వం పై మండిపడ్డారు ప్రభుత్వం పై పోరాటానికి ఎస్ఎఫ్ఐ రూపకల్పన చేస్తుంది అని ఆయన అన్నారు.

## ఎమ్మెల్యే పలకరింపు కార్యక్రమంలో తాండూర్ శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి

తాండూర్ ఈరోజు ప్రతినిధి: తాండూర్ నియోజకవర్గం లోని బషీరాబాద్ మండలంలో ఎమ్మెల్యే పలకరింపు కార్యక్రమంలో తాండూర్ శాసనసభ్యులు పైలెట్ రోహిత్ రెడ్డి నీలపల్లి పంచాయతీ పరిధిలో యాక రామలింగేశ్వరశ దేవాలయం ను సందర్శించి పూజలు చేశారు జలాల్ పూర్ నీలపల్లి ఇస్మాయిల్ పూర్ , మైల్ వార్ ఏక్ మై తన గ్రామాలలో పల్లె పల్లెకు పలకరింపు కార్యక్రమము ద్వారా సంవత్సరం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతరాష్ట్ర సమితి తాండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి గ్రామ గ్రామానికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, నాయకులు చైర్మన్ వెంకటరామిరెడ్డి, శంకర్ రెడ్డి, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్లో అధికారులతో కలిసి పర్యటించిన కార్పొరేటర్ చేతన హరీష్



మేడిపల్లి, సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: హబ్సిగూడ డివిజన్లో ప్రజా సమస్యలపై అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ పర్యటించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో మరియు సాయిచిత్ర నగర్ సెయింట్ జోసెఫ్ స్కూల్ పక్కన డ్రైనేజ్ సమస్యలపై కార్పొరేటర్ అధికారులతో చర్చించారు. రామ్ రెడ్డి నగర్లో డ్రైనేజ్ ట్రంక్ లైన్ పైప్లైన్ పనులు ఇంకా పెండింగ్లో ఉన్నాయని త్వరలో పూర్తి చేయాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రిజిస్టర్ రిటైర్డ్ కార్నెల్ సంజయ్ కపూర్, జలమండలి సిజిఎం నాగేందర్, జిఎం సంతోష్ , డిజిఎం రజనీకాంత్ రెడ్డి ,ఏఈ ఆసిఫ్ అలీ, రవీందర్, బిజెపి సీనియర్ నాయకులు సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ యజ్ఞమహోత్సవం విజయవంతం





మేడిపల్లి, సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ యజ్ఞ సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ బాగయత్ లో ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు యజ్ఞ సమితి అధ్యక్షులు, రాష్ట్ర బిజెపి ఎగ్జిక్యూటివ్ నెంబర్, ఓబీసీ మోర్చా ఉప్పోజి బలవంతచారి పేర్కొన్నారు. ప్రతి ఏటా విశ్వశాంతి కొరకు నిర్వహించే ఈ యజ్ఞ మహోత్సవాన్ని ఈ సంవత్సరం కూడా విశ్వకర్మ భగవానుని యజ్ఞ కార్యక్రమం, పల్లకి సేవా,తీర్థ ప్రసాద వితరణ మరియు అన్న ప్రసాద వితరణ అనంతరం సభ కార్యక్రమాలు నిర్వహించారు,రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు పాల్గొని విజయవంతం చేసినట్టు ఉప్పోజి బలవంతచారి తెలిపారు.ఈ యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు,సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, దాసోజు శ్రవణ్,బీసీ కమిషన్ మెంబర్ ఉపేంద్ర చారి, ఆత్మగౌరవ భావన ట్రస్ట్ చైర్మన్ లాల్ కోట వెంకటాచారి,రగిపణి రవీంద్ర చారి,వేములవాడ మదన్మోహన్ చారి,బొడ్డుపల్లి సుందర్,జి ఆర్ సూర్య రాజ్, సంగమేశ్వర రావు,కుందారం గణేష్ చారి, ఏర్రోజు బిక్షపతి చారి,సుంకోజు కృష్ణమాచారి,ఎరోజు వేణుగోపాల్, ఆర్వి వినయ్ గోపాల్,దానకర్ణ చారి, వింజమూరి రాఘవచారి, చిలుకూరి లక్ష్మీరామాచారి, దేవరకొండ వీరాచారి,పొతులురా చారి, దేవరకొండ వెంకటాచారి పబ్బోజు బిక్షపతి చారి, రాళ్లబండి విష్ణు చారి,నారోజు రాజారాం చారి,రాజమల్లేష్ చారి,చొల్లేటి శ్రీనివాస్ చారి,కిష్టాపూరం రవి,మారేడు పాక రమేష్ చారి,భీష్మాచారి,దంతజు సోమాచారి,పోతకనూరి సంతోష్ చారి,గంగపల్లి తరుణ్ చారి, మారోజు దినేష్,కలకొండ సత్యం చారి,మోలుపోజు నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్నాం: జీవి బిల్డర్స్ అధినేత జ్యోతి వేలూరు



మేడిపల్లి, సెప్టెంబర్ 19ఈరోజు ప్రతినిధి: సామాన్య ప్రజలకు అందుబాటు ధరలలో తమ వెంచర్లలో ఇళ్ల స్థలాలను అందిస్తూ, సేవా కార్యక్రమాలతో ముందుకెళ్తున్నామని జేవి బిల్డర్స్ అధినేత జ్యోతి వేలూరు వెల్లడించారు. ఉప్పల్లోని లోటస్ హోటల్లో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు సహాయాన్ని అందిస్తున్నామన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా జేవి హాస్పిటల్, జెవి మార్ట్స్ ఏర్పాటు చేయనట్లు ఆమె తెలిపారు. తమ సంస్థ మూడు సంవత్సరాల కాలంలో 9 వెంచర్లను విజయవంతంగా పూర్తి చేసి సక్సెస్ మీట్ ను నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రూపు ద్వారానే విజయాలు సాధించడం జరుగుతుందని అన్నారు. త్వరలోనే మరిన్ని వెంచర్లు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇండ్ల స్థలాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సలహాదారులు లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు ఆనంద్ ,బాలరాజు గౌడ్, రాకేష్, నవీన్ ,సాయికుమార్, సంతోష్ కుమార్, సైదులు గౌడ్, నరసింహ గుప్తా, పన్నాలాల్, నరసింహ, ప్రతాప్ కుమార్, బసవరాజు, కృష్ణ గౌడ్, కష్టమర్లు పాల్గొన్నారు.

## చిన్నారి సిద్ధును ఆశీర్వదించిన డాక్టర్ మట్టా దయానంద్..



తల్లాడ, సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన వేముల రామారావు, త్రివేణి దంపతుల కుమారుడు సిద్ధు అన్నప్రాసన్న వేడుక మంగళవారం గార్లొడ్డులోని నరసింహస్వామి దేవాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే రామారావు, దగ్గుల నాగిరెడ్డి, మారెళ్ళ మల్లికార్జునరావు, పొన్నం కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ తాళ్ళ జోసెఫ్, సూద నరసింహారావు, రావుల గోపి గౌడ్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కొరారు రాఘవ పుట్టినరోజు వేడుకలు



మధిర సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలోజిలుగుమాడు గ్రామ అభివృద్ధి రథసారథి టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్కే ఫౌండేషన్ నిత్యాన్నదాత అందరి బంధువు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు శ్రీ కొరారురాఘవ పుట్టినరోజు సందర్భంగా ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో వృద్ధులకు వికలాంగులకు మతిస్థిమితం కోల్పోయిన వారి కొరకు 50 కేజీల బియ్యం అందించి కేకు కత్తిరించి పండ్లు అందించి అన్నదానం చేశారు. ఆర్కే ఫౌండేషన్ అభివృద్ధికై సహకరిస్తూ ఏ అవసరం వచ్చిన మాకు ముందుండి నడిపించే దైవ సమానులు శ్రీ కొరారు రాఘవ పుట్టినరోజు సందర్భంగా వారికి అభినందనలు తెలియజేస్తూ అన్నదానం నిర్వహించిన వారి అభిమానులకు కొరారు యూత్ సభ్యులకుఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమం నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ జ్యోతి కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో లంకె మల్లి నాగేశ్వరరావు, గాలి నాగేశ్వరరావు, దేవి శెట్టి రామకృష్ణ, మండ మురళి, నరేష్, కృష్ణారావు ,నాగరాజు మండ రామకృష్ణ, శ్రీకాంత్, రఘు రాజేష్ కొరారు యూత్ సభ్యులు జిలుగుమాడు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మిస్సయిన మొబైల్ ఫోను ఫిర్యాదు దారునికి అందించిన రూరల్ ఎస్సై ఎండి రఫీ



మధిర రూరల్ సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: మండల పరిధిలోని వంగవీటి గ్రామానికి చెందిన వ్యక్తి వారం రోజుల క్రితం తన మొబైల్ ఫోన్ పోయిందని రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశాడు. మొబైల్ మిస్సింగ్ పై టౌన్ ఎస్ఐ రఫీ విచారణ చేపట్టి ట్రేస్ అవుట్ చేసి కనుగొన్నారు. కనుగొన్న మొబైల్ ను ఫిర్యాదుదారునికి ఈరోజు రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఎస్సై ఎండీ ఉఫాతుల్ రఫీ అందజేయడం జరిగింది. వేగంగా స్పందించి పోగొట్టుకున్న ఫోనును కనుగొని అందజేసిన రూరల్ ఎస్సై కి ,వారు సిబ్బందికి ఫిర్యాదుదారుడు కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## గణేష్ ఉత్సవాల్లో కొలువుదీరిన గణనాథులు





మధిర సెప్టెంబర్ 18ఈరోజు ప్రతినిధి: మండల మున్సిపాలిటీ పరిధిలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో మండలంలో పలు అనేక కూడళ్లలో గణనాథులను మంటపాల్లో కొలువు తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలం పరిధిలో అనేక దేవాలయ పరిధిలో అనేక స్వచ్ఛంద సేవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ ఉత్సవాలు ప్రారంభమై భక్తిశ్రద్ధలతో కులమతాల అతీతంగా స్వచ్ఛందంగా వాడవాడల ప్రాంగణ ఆవరణలో గణనాథుల మండపాలు కొలువుదీరిన గణనాథుడు అనేక రూపాలలో దర్శనమిస్తున్న గణనాథుడు అధిక సంఖ్యలో పెద్దలు భక్తులు ప్రజలు పాల్గొని గణనాథుడు ఉత్సవాల పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని స్వామి కృపకు పాత్రులు అయ్యారు అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలో లడక బజాజ్ సాయి నగర్ సుందరయ్య నగర్ రామాలయం చెరుకుపల్లి వారి వీధి మెయిన్ రోడ్ లో గల వినాయకుడి దేవాలయం మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వాడవాడలా గణేష్ ఉత్సవాలు ఘనంగా భక్తులు ప్రజలు చే నిర్వహించారులిప్రజా రైతు బజార్లి కూరగాయల మార్కెట్ లో మార్కెట్ నిర్వాహకులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుని నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరేష్ వెంకట స్వప్న దంపతులచే అర్చకులు సత్యనారాయణ చారి పూజాధికాలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాద వితరణ చేశారు ఈ కార్యక్రమంలో భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

# మహాగణపతికి తొలి పూజా చేసిన గవర్నర్ తమిళసై

## 75 అడుగుల కండువా పట్టు వస్త్రాలు సమర్పించిన ఖైరతాబాద్ పద్మశాలి సంఘం

### ఏకదంతుని దర్శించుకున్న హర్యాన గవర్నర్ దత్తాత్రేయ, మంత్రి తలసాని ఎమ్మెల్యే దానం

### 300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు



హైదరాబాద్ ఈరోజు ప్రతినిధి: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఖైరతాబాద్ మహా గణపతికి తొలి పూజలు రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర రాజన్ నిర్వహించారు. 63 అడుగుల ఎత్తులో కొలువుదీరిన శ్రీ మహా విద్యా గణపతి గా ఈ ఏడాది భక్తుల నీరాజనాలు అందుకోనున్నారు.

**పట్టు వస్త్రాలు సమర్పించిన పద్మశాలి సంఘం**

ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది భారీ గణపయ్యకు 75 అడుగుల కండువా జంజం గరికమాలను సమర్పించింది. సోమవారం ఉదయం 7 గంటలకు రాజ్ దూత్ చౌరస్తా నుంచి అద్భుతంగా అలంకరించిన గుర్రపు బగ్గీలో పట్టు వస్త్రాలు కండువా జంజం గరికమాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రచరణలు, కళాబృందాల కోలాటాల నడుమ అల్లంత ఎత్తున మహా గణపయ్యకు పద్మశాలి సంఘం ప్రత్యేకంగా రూపొందించిన పట్టు వస్త్రాలను లైబ్రరీ చౌరస్తాకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి 75 అడుగుల జంధ్యాన్ని సమర్పించారు. 75 అడుగుల కండువాను హైదరాబాద్ సిటీ స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ విశ్వ ప్రసాద్, 75 అడుగుల గరికమాలను ఐఏఎస్ అధికారి వెంకటేష్ సమర్పించారు. గణపతికి ఇరువైపులా కొలువురిన సరస్వతి దేవి, వారాహి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ బీసీ నీరజ ప్రభాకర్లు అందజేశారు. అనంతరం గవర్నర్ తమిళసై గణనాథుడికి మొదటి పూజలు నిర్వహించగా హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ లు ఏకదంతుల్ని దర్శించుకున్నారు.

**పటిష్ట బందోబస్తు...**

మహాగణపతి దర్శించుకునేందుకు నగరం నుంచే కాక రాష్ట్రవ్యాప్తంగా భక్తులు రానున్న నేపథ్యంలో స్థానిక ఖైరతాబాద్ పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇద్దరు ఏసీపీల పర్యవేక్షణలో సుమారు 300 మంది భద్రతా విధుల్లో ఉంటారు. గణపతికి నాలుగు వైపులా 75 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులు పాటే సాగే ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ మరో వంద మంది వరకు వాలంటీర్లను నియమించింది.

**బారికేడ్ల ఏర్పాటు......**

లక్షల మంది భక్తులు తరలి వస్తుండడంతో గణపతికి నాలుగు వైపులా భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ ప్రధాన రహదారి గుండా రైల్వే గేట్ వైపు నుంచి వచ్చే భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా గణపతి వద్దకు చేరుకున్నారు. జిహెచ్ఎంసి వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా లకిడికపూల్ వైఫ్ నుంచి వచ్చే భక్తులను అనుమతిస్తున్నారు. ఐబాక్స్ మీదుగా వచ్చే భక్తుల కోసం టెక్స్ట్ బుక్ ప్రింటింగ్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన భారీ కేట్ల నుంచి అనుమతి ఇవ్వనున్నారు.

## శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో కలశ పూజ



మధిర సెప్టెంబర్ 18 ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలో లడక బజార్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈరోజు వినాయక చవితి పర్వదినాన ఈరోజు ఉదయం నుండి వినాయకుడి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు పూజలు ఈరోజు ఉదయం శ్రీ గణపతి ఉప ఆలయం సందర్భంగా తెల్లవారుజామునే నిత్య శ్రీ గణపతి హోమము శ్రీ గణపతికి 10 గంటల 15 నిమిషాలకు 108 కలశములతో కలశపూజ, కలశాభిషేకం మరియు నాగేంద్ర స్వామికి,మాలికాపురత్తమ్మ అమ్మవారికి శ్రీ స్వామి అయ్యప్ప వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయం ఆలయ కమిటీ వారు తెలిపారు ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయక చవితి పండుగ పురస్కరించి భక్తులచే నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు ఈ కార్యక్రమానికి భక్తులు ప్రజలు పాల్గొన్నారు

## ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తాచాటిన గుడ్‌న్యూస్..



ఏన్కూరు, సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: మండలంలోని తూతక లింగన్నపేట గుడ్‌న్యూస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండలస్థాయి పాఠశాల క్రీడల్లో సత్తాచాటి పలు విభాగాల్లో ప్రథమస్థానంలో చాటారు. ఆటల్లో బహుమతులు సాధించిన బాలబాలికలను మంగళవారం పాఠశాల కళావేదికలపై ప్రిన్సిపల్ సిస్టర్ బ్రిటో, పీఈటి లక్ష్మణ్ అభినందించారు. చదువుతోపాటు విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని, సొంత గ్రామాలకు పాఠశాలలకు మంచి పేరు తేవాలని అన్నారు. మండలస్థాయి క్రీడల స్ఫూర్తితో జాతీయ స్థాయి వరకు ఎదగాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి: చావా పద్మ





మధిర రూరల్ సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలోఅంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సి ఐ టి యు ఏ ఐ టి యు సి రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా 9వ ఈరోజు మధిర లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మానవహారం అనంతరం కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారుఈ సందర్భంగా చాలా పద్మ మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు, ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని అయినవారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేదని, కనీస వేతన చట్టం అమలు పరచడం లేదని, అదనపు పనికి వేతనం ఇవ్వటం లేదని పేర్కొన్నారు. అంగన్వాడి ఉద్యోగులను ఆయాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, అదనపు, పనికి అదనపు వేతనం ఇవ్వాలని రాజకీయ ఒత్తిడి లను నివారించాలని, పని భారాన్ని తగ్గించాలని ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించాలని ఇప్పటివరకు తొమ్మిది రోజుల పాటు సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి కళ్ళు లేవని ఆమె అన్నారు... సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, సిఐటియు మధిర టౌన్ కన్వీనర్ పడకంటి మురళి, సిఐటియు మండల నాయకులు వడ్రానపు మధు, అంగన్వాడీ టీచర్స్, మినీ వర్కర్స్ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## అంగనవాడి ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన వినాయక చవితి వేడుకలు



మధిర రూరల్ సెప్టెంబర్ 18 ఈరోజు ప్రతినిధి: అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని విఘ్నేశ్వరుడికి వినతి పత్రం. మున్సిపాలిటీ పరిధిలోఅంగన్వాడి సమస్యల పట్టించుకోకపోతే కేసీఆర్ ను కూడా గంగాలో కలుపుతాంఅంగన్వాడి ప్రాజెక్టు నాయకురాలు చావా పద్మ. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు ఏఐటియుసి రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా 8వ ఈరోజు మధిర తాసిల్దార్ కార్యాలయం లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చాలా పద్మ మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు, ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని అయినవారికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేదని, కనీస వేతన చట్టం అమలు పరచడం లేదని, అదనపు పనికి వేతనం ఇవ్వటం లేదని పేర్కొన్నారు. అంగన్వాడి ఉద్యోగులను ఆయాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, అదనపు, పనికి అదనపు వేతనం ఇవ్వాలని రాజకీయ ఒత్తిడి లను నివారించాలని, పని భారాన్ని తగ్గించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విఘ్నేశ్వరుడికి అందజేయడం జరిగిందిఈ సమస్యలన్నీ కేసిఆర్ పట్టించుకోకపోతే కెసిఆర్ ని కూడా గంగలో నిమజ్జనం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోసీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, సిఐటియు మండల నాయకులు వడ్రానపు మధు, రైతు సంఘం మండల అధ్యక్షులు పాపినేని రామ నరసయ్య, అంగన్వాడీ టీచర్స్, మినీ వర్కర్స్ ఆయాలు తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

**పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి**





మేడిపల్లి, సెప్టెంబర్19 ఈరోజు ప్రతినిధి: వినాయక చవితి వేడుకలు ఉప్పల్ ప్రెస్ క్లబ్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పాల్గొని గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతుల వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుకుట్ల నరోత్తం రెడ్డి, కార్యనిర్వహణ అధ్యక్షులు వేముల తిరుపతిరెడ్డి, నియోజకవర్గం అధ్యక్షులు పల్లా మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మాదిరాజు సురేష్ కుమార్, పారేల్లి సాగర్, కోశాధికారి రెడ్డిమల్ల యాదగిరి, సంయుక్త కార్యదర్శిలు మునుకుంట్ల అశోక్, దాసరాజు, ముఖ్య సలహాదారులు కొలనుపాక చంద్రమౌళి, బీఆర్ఎస్ నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి, ఆకుల మహేందర్ అన్న బాలకృష్ణ, రామ్ రెడ్డి, చింతల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ కార్పొరేషన్లో రూ 2.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి



మేడిపల్లి, సెప్టెంబర్ 19ఈరోజు ప్రతినిధి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో రూ 2.10 కోట్లతో పలు అభివృద్ధి పనులను మేయర్ సామల బుచ్చిరెడ్డి, కార్పొరేటర్లులతో కలిసి కార్మికశాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు కార్పొరేషన్ లోని11వ డివిజన్ హేమానగర్ కాలనీలో రూ 20 లక్షలతో డ్రైనేజీ, రూ 29.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ కొత్త శ్రీవిద్య చక్రపాణి గౌడ్ తో కలిసి మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం 8వ డివిజన్ లోని ద్వారకా నగర్లో రూ 22లక్షలతో సీసీ రోడ్డు,19వ డివిజన్లో రూ 50 లక్షలతో బిటి రోడ్డు, ఈస్ట్ బృందవాన్ కాలనీలో రూ 22 లక్షలతో సీసీ రోడ్డు మరియు 12వ డివిజన్ అంబెడ్కర్ నగర్ పేస్ 2 లో రూ 18 లక్షలతో సీసీ రోడ్డు, 14వ డివిజన్ ఆర్ఎన్ఎస్ కాలనీలో రూ 20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, 28వ డివిజన్ సాయి ఎంక్లేవ్ లో రూ 20 లక్షలతో సీసీ రోడ్డును స్థానిక కార్పొరేటర్లతో కలిసి మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, యువజన విభాగం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని ఇంచార్జ్ మణిపూర్ ను కలసిన మర్రి నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 19 ఈరోజు ప్రతినిధి: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్చార్జిగా మణిపూర్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 7సార్లు ఎమ్మెల్యే గా, 2 సార్లు సిడబ్ల్యూసి మెంబర్ గా, మణిపూర్ మాజీ పీసీసీ అధ్యక్షులు గా, మాజీ హోం శాఖ మంత్రి గా,డిప్యూటీ సీఎం గా సేవలందించిన గైఖాంగమ్ గాంగ్మీ గారిని నియమించడం జరిగింది. 18/09/2023 టిపిసిసి సభ్యులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత 22 సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న నన్ను ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు, గంటకు పైగా జరిగిన సుదీర్ఘ చర్చలో వివిధ అంశాలపై చర్చించారు, ఏఐసిసి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం యువతకు అవకాశం కల్పించాలన్నారు, చర్చల అనంతరం సానుకూలంగా స్పందించిన గైఖా%శీ%గమ్ గాంగ్మీ యువతకు ప్రాధాన్యత లో తను ముందు ఉంటానని యువతకు అవకాశాల గురించి పరిశీలిస్తున్నామని తెలిపారు.

## యాదవులకు ప్రాముఖ్యత కల్పించాలి..



తల్లాడ, సెప్టెంబర్ 19ఈరోజు ప్రతినిధి: హైదరాబాద్ హోటల్ తాజ్ కృష్ణ లో ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ మెంబర్, ఉత్తరాఖండ్ ఇంచార్జ్ దేవేందర్ యాదవ్ ని యాదవ సంఘం నాయకులు కలిసి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో యాదవుల ప్రాధాన్యత గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా (18 శాతం) కలిగిన యాదవులకు కనీసం 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించే విధంగా అగ్రనాయకత్వంను ఒప్పించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా కలిసి అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని కోరిన వారు. లోకేష్ యాదవ్..ఖమ్మం అసెంబ్లీలక్ష్మణ్ యాదవ్.. అంబర్పేట, శ్రీనివాస్ యాదవ్..షాద్ నగర్,రాములు యాదవ్.. పెద్దపల్లి,వీరితో పాటుగా ఇంకా ఆరు అసెంబ్లీ స్థానాలు కోరడం జరిగింది.

## రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం పని చేయాలి

**కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ బిజెపి నాయకులు**



చేవెళ్ల: ఈరోజు ప్రతినిధి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామానికి చెందిన బిజెపి బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత వార్డు మెంబర్లు,మాజీ ఉపసర్పంచ్,బిసి యువ నాయకులు మైనార్టీ నాయకులు సుమారుగా 80 మంది పైగా కేఎల్ఆర్ నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోనె ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కి పూర్వ వైభవానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు తెలంగాణ రాష్ట్రంలో బలపడుతుందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని భీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు సున్నపు వసంతం. పామేనా బీమ్ భారత్. %ూాజూ% చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి. డిసిసి ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జనార్దన్ రెడ్డి. ఓబిసి సెల్ మండల అధ్యక్షుడు సూర్యాపేట శ్రీనివాస్ గౌడ్. మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్న శ్రీకాంత్ రెడ్డి. ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్. మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి వాజిద్. మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్ పడాల. రామచంద్ర. గోనె జంగారెడ్డి. మాధవరెడ్డి. శంకర్. గోపి. శ్రీనివాస్. ముడిమ్యాల గ్రామం యువ నాయకులు మాజీ ఉప సర్పంచ్ ఊరడి సంజీవ. సతీష్. 5 వార్డ్ నెంబర్ బేకరీ శివకుమార్ తదితరులు చేరినారు.

# పాన్ ఇండియా లీగ్‌లో మరో తమిళ తంబీ



సౌతిండియన్ సినీపరిశ్రమల్లో ఒక కొత్త పరిణామం అంతకంతకు ఉత్కంఠ రేపుతోంది. బాహుబలి స్టార్ ప్రభాస్ తర్వాత పాన్ ఇండియా స్టార్ డమ్ కోసం ప్రయత్నించే హీరోల సంఖ్య అమాంతం పెరిగింది. స్వభాషతో పాటు ఇరుగు పొరుగు భాషల్లోను తమ పరిధిని విస్తరించుకునేందుకు ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలతో బిజీగా ఉన్నారు. ప్రభాస్ కంటే చాలా ముందే రజనీకాంత్, కమల్ హాసన్, విక్రమ్ లాంటి స్టార్లు పాన్ ఇండియా సినిమాలతో ఆకట్టుకున్నవారి జాబితాలో ఉన్నారు. కానీ రేస్ లోకి ప్రభాస్ రాకతో అమాంతం సన్నివేశం మారింది. దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సెట్ చేసిన కొత్త ట్రెండ్ తో దేశంలోని అన్ని పరిశ్రమల్లో చాలా మంది హీరోలు ఆ రేంజులో పాన్ ఇండియా మార్కెట్లను కొల్లగొట్టాలని కలలు కనడం మొదలైంది. డార్లింగ్ ప్రభాస్ సహచరులైన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. యంగ్ టైగర్ ఎన్టీఆర్.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్.. ఇప్పటికే పాన్ ఇండియా రేసింగ్ ని పరాకాష్ఠకు చేర్చారు. ఆర్.ఆర్.ఆర్ స్టార్లుగా చరణ్, ఎన్టీఆర్ ఇప్పటికే పాన్ ఇండియా స్టార్ డమ్ అందుకున్నారు. తదుపరి వరుసగా పాన్ ఇండియా అప్పీల్ ఉన్న స్టార్ డైరెక్టర్లతో వీళ్లంతా పని చేస్తున్నారు. అలాగే రాజమౌళితో సినిమా చేస్తుండడంతో మహేష్ బాబు కూడా పాన్ ఇండియా రేసులో చేరారు. మరోవైపు తమిళం నుంచి కూడా ఇలాంటి పోటీ ఉత్పన్నమైంది. అక్కడ చాలాకాలంగా దళపతి విజయ్, తలా అజిత్ సహా చాలామంది స్టార్లు పాన్ ఇండియా మార్కెట్ కొల్లగొట్టాలని కలలుగంటున్నారు. ఇక తమిళం-తెలుగులో అసాధారణ స్టార్‌డమ్ అందుకున్న సూర్య సైతం ఇప్పుడు సౌతిండియాలో ఇతర మార్కెట్లతో పాటు ఉత్తరాది మార్కెట్ పైనా కన్నేశాడు. తన పరిధిని అమాంతం విస్తరించేందుకు ధీటైన ప్రణాళికలతో దూసుకొస్తున్నాడు. సూర్య తదుపరి బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూ అమాంతం చర్చల్లోకొస్తున్నాడు. తన స్థాయిని ఒకేసారి పదింతలు పెంచుకునే ప్రయత్నమిదని క్రిటిక్స్ విశ్లేషిస్తున్నారు.

## 'దేవర' పై యాక్షన్ మళ్లీ మొదలు !




స్టార్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వంలో 'యంగ్ టైగర్ ఎన్టీఆర్' హీరోగా రాబోతున్న పాన్ ఇండియా సినిమా 'దేవర'. సైమా అవార్డ్స్ కోసం ఎన్టీఆర్ దేవర షూటింగ్ కి గ్యాప్ ఇచ్చాడు. ఐతే, దుబాయ్ నుంచి ఎన్టీఆర్ తిరిగి రావడంతో ఇప్పుడు ఈ సినిమాకి సంబంధించిన కొత్త షెడ్యూల్ పై క్లారిటీ వచ్చింది. రేపటి నుంచి ఎన్టీఆర్ పై సోల్మన్ మాస్టర్ కొరియోగ్రఫీలో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించబోతున్నారని తెలుస్తోంది. ఈ యాక్షన్ షెడ్యూల్ లో జూ.ఎన్టీఆర్ తో పాటు సైఫ్ అలీఖాన్, శ్రీకాంత్ లు కూడా పాల్గొనబోతున్నారని టాక్. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది.కాగా ఈ సినిమా కోసం లెంగ్తీ షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నాడు కొరటాల. కాబట్టి.. ఈ సినిమా షూట్ వేగంగా జరగనుంది. అన్నట్టు ఈ సినిమాలో ఎన్టీఆర్ లుక్ కూడా అదిరిపోతోందట. అందుకు తగ్గట్టుగానే తన పాత్ర కోసం తారక్ కూడా డిఫరెంట్ మేకోవర్ ట్రై చేస్తున్నాడు. మొత్తానికి.. ఈ సినిమా కోసం కొరటాల కూడా బాగా కసరత్తులు చేస్తున్నాడు. ఇప్పటికే ఎన్టీఆర్ - కొరటాల కాంబినేషన్ లో గతంలో వచ్చిన 'జనతా గ్యారేజ్' పెద్ద హిట్ కావడంతో ఈ సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి.

## 'పుష్ప 2' ఐటమ్ సాంగ్ పై క్రేజీ రూమర్ ?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో అత్యంత ప్రతిష్టాత్మకంగా వచ్చిన 'పుష్ప- ది రైజ్' చిత్రంలో సమంత ఐటమ్ సాంగ్ సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పుష్ప-2 లోని ఐటమ్ సాంగ్ అప్ డేట్ కోసం బన్నీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో 'పుష్ప 2' ఐటమ్ సాంగ్ పై ఓ క్రేజీ రూమర్ వినిపిస్తోంది. హీరోయిన్ జాన్వీ కపూర్ చేత ఈ ఐటమ్ సాంగ్ చేయించాలని సుకుమార్ ప్లాన్ చేస్తున్నాడని.. సమంత సాంగ్ కంటే కూడా.. జాన్వీ కపూర్ పై సాంగ్ అదిరిపోతుంది అని టాక్ నడుస్తోంది. మరి ఐటమ్ సాంగ్ కి జాన్వీ కపూర్ ఒప్పుకుంటుందా? చూడాలి.ప్రస్తుతం జాన్వీ కపూర్, ఎన్టీఆర్ దేవర సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. మొత్తానికి పుష్ప 2 సినిమాని సుకుమార్ వెరీ ఇంట్రెస్ట్ గా ప్లాన్ చేశాడు. పైగా ఈ పుష్ప సీక్వెల్ లో కొన్ని కీలక పాత్రలతో పాటు పలు కొత్త పాత్రలు కూడా ఈ పుష్ప 2లో పరిచయం కానున్నాయి. అందుకే పుష్ప 2 కోసం ఫ్యాన్స్ రెట్టింపు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారు. ఇక వచ్చే షెడ్యూల్ లో గుంతకల్లు నల్లమల అడవుల ప్రాంతంలో ఓ హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్సెస్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ట్రోల్స్ కి పని చెబుతున్న థమన్



టాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ గా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ కి థమన్ సొంతం చేసుకున్నాడు. మెజారిటీగా స్టార్ హీరోల సినిమాల కి అతను సంగీతం అందిస్తున్నాడు. ఏడాదికి 10 సినిమాలకి తక్కువ కాకుండా థమన్ చేస్తున్నాడు. వీటిలో మెజారిటీగా స్టార్ హీరోల చిత్రాలే ఉండటం విశేషం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వీరసింహారెడ్డి, వారసుడు, బ్రో సినిమాలకి థమన్ సంగీతం అందించారు. వీటిలో ఒక్క పాట కూడా గుర్తుండిపోయే విధంగా లేదనే విమర్శలు వచ్చాయి. కమర్షియల్ బీట్స్ తప్ప అల వైకుంఠపురంలో తరహాలో ఎక్కువ రోజులు వినిపించే సాంగ్స్ అయితే లేవు. రామ్ పోతినేని స్కంద మూవీకి కూడా థమన్ మ్యూజిక్ అందించారు. ఇప్పటి వరకు మూవీ నుంచి వచ్చిన ఏ ఒక్క సాంగ్ కూడా వైబ్ క్రియేట్ చేయలేదు. తాజాగా కల్ట్ మామ అంటూ ఒక ఐటెం సాంగ్ స్కంద నుంచి ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ పాట కూడా మ్యూజిక్ పరంగా తేలిపోయిందనే మాట వినిపిస్తోంది. అలాగే రామ్ చరణ్, శంకర్ కాంబోలో తెరకెక్కుతోన్న గేమ్ చేంజర్ నుంచి జరగండి జరగండి అనే ఓ సాంగ్ లీక్ అయ్యింది. ఈ సాంగ్ కూడా పెద్దగా ఆకట్టుకునే స్థాయిలో లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాంగ్స్ విషయంలో థమన్ ని సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తూ ఉంటారు. ఎక్కడో ట్యూన్స్ కాపీ చేసి తన సినిమాలకి వాడేస్తూ ఉంటాడనే విమర్శలు అతనిపైన ఉన్నాయి. వీటిపై థమన్ చాలా సార్లు వివరణ ఇచ్చారు. అయితే ఈ ఏడాదిలో థమన్ నుంచి వచ్చిన ఒక్క ఆల్బమ్ కూడా సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకోలేదు. తాజాగా స్కంద, గేమ్ చేంజర్ సాంగ్స్ విషయంలో కూడా తేలిపోయాడనే మాట సోషల్ మీడియా సర్కిల్ లో వినిపిస్తోంది. దీంతో థమన్ మరోసారి ట్రోలర్స్ కి మంచి పని పెట్టాడనే మాట వినిపిస్తోంది. ఈ సాంగ్స్ పైన ట్రోలింగ్ జరిగే ఛాన్స్ అయితే ఉంది. మరి వారికి సమాధానం చెప్పాలంటే బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కచ్చితంగా ఒకటైనా థమన్ నుంచి రావాలి. మహేష్ బాబు గుంటూరు కారం సినిమాకి కూడా థమన్ సంగీతం అందిస్తున్నారు.

## మ్యాడమ్ టుస్సాడ్స్‌లో ఐకాన్ స్టార్ విగ్రహం



అమితాబ్ బచ్చన్, షారూఖ్ ఖాన్, షాహిద్ కపూర్ లాంటి బాలీవుడ్ హీరోలకు మ్యాడమ్ టుస్సాడ్స్ లో మైనపు విగ్రహాలు వెలసిన సంగతి తెలిసిందే. టాలీవుడ్ నుంచి ప్రభాస్, మహేష్ లాంటి స్టార్లకు మ్యాడమ్ టుస్సాడ్స్ లో విగ్రహాల్ని ఆవిష్కరించారు. ఇప్పుడు లండన్ మ్యాడమ్ తుస్సాడ్స్ లో జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇటీవల దీనిపై మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. 'పుష్ప 2' చిత్రీకరణకు బ్రేక్ తీసుకుని మరో రెండు రోజుల్లో బన్ని నేరుగా లండన్ మ్యాడమ్ టుస్సాడ్స్ కి వెళతారని తెలిసింది. అక్కడ రెండు రోజుల పాటు తన మైనపు విగ్రహానికి అవసరమైన కొలతలు ఇవ్వడం సహా ఇతరత్రా ఫార్మాలిటీస్ ని ముగించుకుని తిరిగి వస్తాడని తెలిసింది. వచ్చే ఏడాది ఈ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం ఉందని తెలిసింది. ప్రభాస్ - మహేష్ తర్వాత ప్రతిష్ఠాత్మక మ్యాడమ్ తుస్సాడ్స్ లో విగ్రహం కలిగి ఉండే స్టార్ గా బన్ని పేరు రికార్డులకెక్కనుంది. ఇటీవలే పుష్ప చిత్రంలో నటనకు గాను అల్లు అర్జున్ కి ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డ్ దక్కింది. ఇదే ఉత్సాహంలో అతడు పుష్ప 2 ని మరో లెవల్ కి తీసుకెళ్లాలని హార్డ్ వర్క్ చేస్తున్నాడు. పుష్ప 2తో అతడి రేంజ్ మరో లెవల్ కి ఎదగనుందని కూడా గుసగసలు వినిపిస్తున్నాయి.



## 'గుంటూరు కారం'లో మూడో హీరోయిన్ ?



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో 'గుంటూరు కారం' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ సినిమాలో ఇప్పటికే శ్రీలీల, మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. కానీ తాజాగా వినిపిస్తున్న టాక్ ప్రకారం.. ఇప్పుడు 'గుంటూరు కారం'లో మూడో హీరోయిన్ కూడా ఉంటుందట. కేవలం రెండు సీన్లకు మాత్రమే పరిమితం అయ్యే ఆ పాత్రలో కాజల్ అగర్వాల్ అయితే బాగుంటుందని మేకర్స్ ఫీల్ అవుతున్నారు. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందో చూడాలి. అయితే, గుంటూరు కారం చిత్రంలో ఈ మూడో హీరోయిన్ పాత్ర సెకండ్ హాఫ్ లో వస్తోందట. కాగా గుంటూరు మిర్చి యాడ్ నేపథ్యంలో ఈ సినిమా నడుస్తోంది. ముఖ్యంగా మహేష్ బాడీ లాంగ్వేజ్ కి సరిపడే సరికొత్త స్టోరీతో త్రివిక్రమ్ ఈ సినిమా కథని ప్లాన్ చేశాడట. పైగా ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఒకేసారి రిలీజ్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. హారిక %౦% హాసిని క్రియేషన్స్ భారీ ఎత్తున ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా మహేష్ కెరీర్లో 28వ సినిమాగా తెరకెక్కుతుంది. జనవరి 13, 2024న రిలీజ్ ఈ సినిమా కానుంది.

Edited, Printed Published & Owned by ASVI Media Pvt, Printed at ASVI Media Pvt Ltd, Road no 10 Banajarahills Hyderabad-500080. TS.
And Published at Road no 10 Bnajarahills Hyd-80. ASVI Media RNI TELTEL/2021/55761.